# పండుగ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే ...



నాయుడుపేట జనవరి 8 ప్రభాతవార్త;

నాయుడుపేట పట్టణంలోని స్వర్ణముఖనదిలో ఈనెల 15,16,17తేదిల్లో నిర్వహించే ఏటిపండుగ ఏర్పాట్లును సూళ్ళూరుపేట శాసనసభ్యులు డాక్టర్ నెలవల విజయశ్రీ బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లడుతూ గతసంవత్సరంతో పోలిస్తే ఈఏడాది ఏటిపండుగను ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు.నాయుడుపేటలోని ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి ఏటిపండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆమె సూచించారు.ఏటిపండుగలో ప్రజలకు కావల్సిన అన్నిసౌకర్యాలు అధికారులు కల్పించడం జరుగుతుందన్నారు.పండుగలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని తెలియజేశారు. ఆమె వెంట మున్సిపాల్టి కమిషనర్ ఎస్కె ఫజులుల్లా,మున్సిపాల్టి వైస్‌చేర్మేన్ 786రఫి, నెలవల రాజేష్, ఉయ్యాల ప్రవీణ్,పసల గంగాప్రసాద్,దార్ల రాజేంద్ర,తదితరులు ఉన్నారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





# ప్రజలనుంచి సిఎం చంద్రబాబు వినతుల స్వీకరణ

కుప్పం, జనవరి 8 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు బుధవారం ఉదయం కుప్పం ఆర్‌అండ్‌బి అతిథి గృహం వద్ద ప్రజలనుంచి వినతులు సీ స్వకరించారు. ఈ సందర్భంగా ప్రజలను ఆప్యాయంగా పలకరించి వారి నుంచి వినతులు స్వీకరించారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీలపై తగు చర్యలు తీసుకోవాలని సిఎం చంద్రబాబు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ విద్యాధరిలను ఆదేశించారు. అంతకుముందు సిఎంను మదనపల్లి, కదిరి ఎమ్మెల్యేలు షాజహాన్ బాషా, వెంకట ప్రసాద్‌తో పాటు పలువురు ప్రముఖులు కలిశారు. కార్యక్రమంలో సిఎం కార్యదర్శి ప్రద్యుమ్న, ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, కడ పి.డి. వికాస్ మర్మత్, రాష్ట్ర నేత డా॥ సురేష్‌బాబు, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారా ం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రయాణిస్తున్న

# ఆటో బోల్తా

## ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలు
## ఆరుగురికి స్వల్ప గాయాలు

నగరి, జనవరి 8 ప్రభాతవార్త:





చికిత్స పొందుతున్న చిన్నారులు

మున్సిపల్ పరిధి ఏకాంబరకుప్పం వెళ్లే మార్గంలో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపం గల మలుపు వద్ద ప్రైవేటు ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటో బుధవారం సాయంత్రం బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఏకాంబరకుప్పంకు చెందిన వెట్రి(9), కనిష్క(9) అనే ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలు కాగా మరో ఆరుగురు చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. పరుగున వెళ్లిన స్థానికులు బోల్తా పడిన ఆటో నుంచి విద్యార్థులను బయటకు తీశారు. అప్పటికే విషయం తెలుసుకుని భయాందోళనతో సంఘటనా స్థలానికి వచ్చిన పిల్లల తల్లిదండ్రులు స్వల్ప గాయాలైన వారిని వెంటనే ఇళ్ళకు తీసుకెళ్లారు. స్థానిక ఏరియా ఆస్పత్రికి చేర్చారు. తల్లడిల్లుతున్న చిన్నారులను చూసి తల్లిదండ్రులు బోరున విలపించడం ఆస్పత్రిలో ఉన్న వారిని సైతం కలచివేసింది. ప్రాథమిక చికిత్స అనంతరం వెట్రిని తిరుపతి రుయాకు తరలించారు. 8 మంది విద్యార్థులు ప్రతిరోజు ఈ ఆటోలోనే వెళుతుంటారని విద్యార్థుల తల్లిదండ్రులు తెలుపుతున్నారు. మలుపు వద్ద రోడ్డు సరిగాలేక అదుపు తప్పడమే ప్రమాదానికి కారణమని సీఐ మహేశ్వర్ తెలిపారు.

# గోవిందా... ఎవరిదీ పాపం!

## -వైకుంఠ దర్శన టోకెన్‌ల తొక్కిసలాట -తిరుపతిలో ఆరుమంది భక్తులు మృతి
## అవగాహనలోపం...నియంత్రణ వైఫల్యం -బాధ్యత ఎవరిదీ! బాధ్యులెవరు!! -సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి















తిరుపతి,జనవరి 8ప్రభాతవార్త:

వైకుంఠద్వార దర్శన టోకెన్లుకోసం భారీగా తరలివచ్చిన భక్తులను నియంత్రించి కట్టడిచేయడంలో అటు టిటిడి అధికారులు ఇటు పోలీసుయంత్రాంగం ఘోర వైఫల్యంతో ఆరుమంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. భారీగా తరలివచ్చిన భక్తులు తిరుపతిలోని శ్రీనివాసం, బైరాగిపట్టెడలోని రామానాయుడు పాఠశాల, సత్యనారాయణపురంలోని కౌంటర్లవద్ద బుధవారం రాత్రి పెద్దతోపులాటలో క్రిందపడిన భక్తులపై ఇతర భక్తులు తొక్కిసలాటతో ఈ విషాదం జరిగింది. తిరుపతిలోని శ్రీనివాసం వసతి సముదాయం కౌంటర్‌ల వద్ద, సత్యనారాయణపురం, బైరాగిపట్టెడ పద్మావతి పార్కునుండి వెళ్ళే ప్రాంతాల్లో జరిగిన, తొక్కిసలాటలో తమిళనాడు సేలంకు చెందిన మల్లిక ,మరో ముగ్గురు మహిళలు, ఇద్దరు మగవాళ్ళు ప్రాణాలు కోల్పోయారు.. మరో 20మందివరకు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ సంఘటనలో వారిని రుయా,స్విమ్స్‌కు తరలించారు. పూర్తిగా టిటిడి ఉన్నతాధికారులు, విజిలెన్స్ అధికారులు, జిల్లా పోలీసు యంత్రాంగం అవగాహన లోపంతో, నియంత్రణలో వైఫల్యమే భక్తులు ప్రాణాలు కోల్పోవడానికి కారణమైందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం రాత్రి జరిగిన ఈ విషాద సంఘటనపై సిఎం చంద్రబాబునాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాగా భక్తులను దర్శనాలకు రమ్మని టోకెన్లు జారీకంటే ముందే టోకెన్లు ఇవ్వడంతోనే ఈ తొక్కిసలాట జరిగిందనేది అక్కడ ప్రత్యక్షసాక్షుల భక్తుల మాటలు. ఉన్నఫళంగా రాత్రి 9.30గంటల ప్రాంతంలో టోకెన్లు జారీచేయడంతో క్యూలైన్లలోకి చేరుకునేందుకు భక్తులు పరుగులుతీయడంతో తొక్కిసలాట జరిగింది. తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు రుయాకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

### మధ్యాహ్నం నుండి అదుపుతప్పిన నియంత్రణ

కొండపైన శ్రీవారి ఆలయంలో వైకుంఠద్వార దర్శనాలకోసం కొండక్రింద తిరుపతిలో బయటి ప్రాంతాల నుండి భారీగా తరలివచ్చిన భక్తులు ఉచిత టోకెన్‌ల కోసం అవస్థలు తప్పలేదు. నిర్దేశించిన సమయం కంటే 18-20గంటల ముందే 40వేలమంది భక్తులు తిరుపతికి రావడంతో బుధవారం మధ్యాహ్నం నుండే ఆహారం, తాగునీరు, ఇతర సౌకర్యాల కోసం తంటాలు పడ్డారు. ఒక్కసారిగా వేలాదిమంది తరలివచ్చేయడంతో ఆఫ్‌లైన్‌లో దర్శన టోకెన్లు జారీచేసే ఇందిరామైదానం,,శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవికాంప్లెక్స్,ఎంఆర్‌పల్లి,బైరాగిపట్టెడ, జీవకోన,రామచంద్రపుష్కరిణి ప్రాంతాల్లో ఎక్కడ చూసినా ఎటు చూసినా గోవిందమాలలు ధరించిన భక్తులు, తమిళనాడు, కర్నాటక, తెలుగూరాష్ట్రాల నుండి కొన్నివందల కిలోమీటర్లు కాలినడకన ,వాహనాల్లో చేరుకున్న వారితో కిక్కిరిసిపోయాయి. నేటి ఉదయం 5గంటలకు వైకుంఠద్వార దర్శన టోకెన్లు జారీచేస్తారని తెలిసినా, పవిత్రమైన మోక్షమార్గం వైకుంఠద్వార దర్శనాల కోసం తమతమ లగేజీలతో బుధవారమేచేరుకున్నారు. వెంట తెచ్చుకున్న ఆహారపదార్థాలు ఖాళీచేయడంతో నగరంలోని హోటళ్ళపై ఆధారపడ్డారు. బుధవారం సాయంత్రానికి తిరుపతి నగరంలో బయటినుండి వచ్చిన భక్తులతో కిటకిటగా మారిపోయింది. రోడ్లపైనే భక్తులు తిష్టవేయడంతో ఆ మార్గాలన్నీ కిక్కిరిసిపోయాయి. భారీగా చేరుకున్న భక్తులను నియంత్రించడంలో అటు పోలీసులు ఇటు టిటిడి విజిలెన్స్‌సిబ్బంది కూడా తలలుపట్టుకునే పరిస్థితి కనిపించింది. పరిస్థితి అదుపుతప్పింది. భక్తులు తోపులాటకు అవకాశం ఉన్నా పోలీసు, విజిలెన్స్ నియంత్రణలో వైఫల్యం చెందారు. బుధవారం మధ్యాహ్నానికి తిరుపతిలో జనసంద్రంచేరడంతో ఎవరి కష్టాలు వారివేఅన్నట్లు మారింది. వరుసగా 10,11,12తేదీలకు గాను 1.20లక్షలు టోకెన్లు నేడు ఒకరోజే జారీచేయడంతోనే ఈ తొక్కిసలాటు జరిగిందనేది తెలుస్తోంది.

# నగల కోసం

# వృద్ధురాలిపై మహిళ హత్యాయత్నం..!

## 10లక్షల నగదు చోరీ..స్పృహలోకి వచ్చిన వృద్ధురాలు
## డిఎస్పీ ఆధ్వర్యంలో నిందితురాలు అరెస్టు



నిందితురాలిని అరెస్టు చూపుతున్న పుత్తూరు డిఎస్పీ రవికుమార్ తదితరులు

నారాయణవనం, జనవరి 8 ప్రభాతవార్త :

మండలకేంద్రంలోని నారాయణవనం మేజర్ పంచాయతీ నవసందు వీధికి చెందిన ఓసూరమ్మ(89) అనే ఒంటరి వృద్ధురాలిపై అదే ప్రాంతానికి చెందిన దిగువగాండ్ల వీధికి చెందిన లేట్ ఎం రఘునాథరెడ్డి భార్య వల్లియమ్మ(45) నగలను దొంగిలించడం కోసం హత్యాయత్నంకు పాల్పడిందని పుత్తూరు డిఎస్పి రవికుమార్ తెలిపారు. నారాయణవనం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం నిందితురాలు అరెస్టు చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 1వ తేది మధ్యాహ్నం 1గంటకు ఓసూరమ్మ ఇంట్లో ఒంటిరిగా వున్న సమయంలో వల్లియమ్మ ఇంటికి వెళ్లి దాడికి పాల్పడింది. ఈ దాడిలో ఓసూరమ్మ తలకు గాయాలు ఏర్పడడంతో స్పృహ తప్పి పడిపోయింది. దీంతో ఓసూరమ్మ చనిపోయిందని భావించిన వల్లియమ్మ ఆమె వద్ద వున్న 16 సవర్ల బంగారు దాని విలువ 10లక్షలు వుంటుందని చెప్పారు. అయితే ఓసూరమ్మకు రెండు గంటల తర్వాత స్పృహ వచ్చిన తర్వాత జరిగిన విషయాన్ని ఆమె బందువు అయిన అయ్యప్పకు చెప్పింది. వెంటనే గాయపడ్డ ఓసూరమ్మను ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు పూర్తి స్థాయిలో విచారణ జరిపారు. పుత్తూరు అర్బన్ సిఐ సురేంద్రనాయుడు, పిచ్చాటూరు ఎస్ఐ వెంకటేష్, తన సిబ్బందితో పూర్తి స్థాయిలో విచారణ జరిపారు. విచారణలో వల్లియమ్మ ఓసూరమ్మ ఇంటికి వెళ్లి వచ్చిన ఆనవాళ్లు సిసి కెమెరాల్లో రికార్డు కావడంతో దొరికిపోయింది. మంగళవారం సాయంత్రం కైలాసకోనలో వున్న వల్లియమ్మను అరెస్టు చేశారు. ఈ కేసును చేదించిన పుత్తూరు సిఐ సురేంద్రనాయుడు, ఎస్ఐ వెంకటేష్‌ను, ఎఎస్ఐ జయరాంనాయక్, క్రైమ్ సిబ్బంది దామోదరం, మోహన్, భాస్కర్, మహిళా కానిస్టేబుల్ ప్రమీల బృందాలను అభినందించారు.

# టిక్కెట్లు,టోకెన్లు లేకుంటే దర్శనాలు "నో"

## -భక్తులు మాస్కులు ధరించి రావాలి
## -టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు



తిరుమల,జనవరి 8ప్రభాతవార్తప్రతినిధి:

వైకుంఠ ఏకాదశి,ద్వాదశి పర్వదినాలతో కలిపి పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలు టిక్కెట్లు, టోకెన్లు పొందిన భక్తులకు మాత్రమేనని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు స్పష్టం చేశారు. టిక్కెట్లు, టోకెన్లు లేని భక్తులకు పదిరోజులు దర్శనాలు ఉండవని, తిరుమలకు వచ్చి ఏర్పాట్లు, స్థానిక ఆలయాలు, సందర్శన ప్రాంతాలను దర్శించుకోవచ్చున్నారు. దర్శన టిక్కెట్లు, టోకెన్లు పొందిన భక్తులు నిర్దేశిత రోజు, సమయానికి తిరుమలకు రావాలని విజ్ఞప్తి చేశారు.తిరుమలకువచ్చే భక్తులు వైరస్ వ్యాప్తిని నివారించేందుకు మాస్కులు ధరించి రావాలని సూచించారు. సామాన్యభక్తులకే వైకుంఠద్వార దర్శనాలు ప్రాధాన్యతనిస్తామని ఆయన తెలిపారు. బుధవారం ఉదయం అన్నమయ్యభవనంలో టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, పనబాకలక్ష్మి, టిటిడి జెఈఓ వీరబ్రహ్మాం, సివిఎస్ఓ శ్రీధర్, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవితో కలసి టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు మీడియాకు ఏర్పాట్లు వెల్లడించారు. రేపు ఉదయం 5గంటలకు వైకుంఠ ఏకాదశిన ప్రముఖులకు బ్రేక్ దర్శనాలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం 8గంటలనుండి సామాన్యభక్తులకు వైకుంఠద్వార దర్శనాలు చేయించేలా చూస్తామన్నారు.

# వేరుసెనగ పంటకు పూర్తి నష్టం

## కేంద్ర కరవు బృంద సభ్యుల దృష్టికి తీసుకువచ్చిన రైతులు



కోణాపల్లిలో కరవు పరిస్థితులను పరిశీలిస్తున్న కేంద్ర కరవు బృంద సభ్యులు

చిత్తూరు, జనవరి 8 ప్రభాతవార్త:

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వర్షాధారంతో సాగు చేస్తే వేరుసెనగ పంటకు ఈ సారి పూర్తి నష్టం జరిగిందని జిల్లాలో కరవు పరిస్థితులను పరిశీలించడానికి వచ్చిన కేంద్ర కరవు బృంద సభ్యులకు రైతులు వివరించారు. కేంద్ర కరవు బృంద సభ్యులు కరవు పరిస్థితులను పరిశీలించడానికి బుధవారం యాదమరి మండలం కోణాపల్లి గ్రామంకు వచ్చారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీ కృష్ణ కేంద్ర కరవు బృంద సభ్యులతో కలిసి క్షేత్ర స్థాయిలో వేరుసెగన పంట నష్టపోయిన పరిస్థితులను పరిశీలించారు. కోణాపల్లి గ్రామంకు చెందిన రైతు చిట్టిబాబు తన పొలంలో వున్న వేరుసెనగ తీగల కుప్ప వద్దకు కేంద్ర కరవు బృంద సభ్యులను తీసుకెళ్ళి చూపించాడు. ఈ సందర్భంగా కేంద్ర కరవు బృంద సభ్యులు రైతు మణితో ఎంత విస్తీర్ణంలో వేరుసెగన పంట సాగు చేశావు! ఏ మేరకు పంట దిగుబడి వచ్చిందనే వివరాలను బృంద సభ్యులు అడిగి తెలుసుకున్నారు. మణి అనే రైతు వేరుసెనగ పంటలో అంతర పంటగా తాను కంది పంట వేయడం జరిగిందని, అయితే వర్షాలు లేకపోవడంతో వేరుసెనగ పంటతో పాటు కంది పంట పూర్తిగా దెబ్బతిన్నదని వాపోయాడు. అనంతరం కేంద్ర బృంద సభ్యులకు కరవుకు సంబంధించి ఫోటో ప్రదర్శనను పరిశీలించారు. అనంతరం కేంద్ర కరవు బృంద సభ్యులు రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం.గిరి అనే రైతు మాట్లాడుతూ తాను జూన్ 14వ తేదీన ఒక ఎకరా విస్తీర్ణంలో వేరుసెనగ పంట సాగు చేయడం జరిగిందని, పంట విత్తిన అనంతరం 20-25 రోజుల వరకు అడపా దడపా వర్షాలు పడ్డాయని, మొకలలు బాగా వచ్చాయని, 30 రోజుల అనంతరం పంట పూత దశకు వచ్చిందన్నారు. జులై చివరి వారం నుండి వర్షం కురవకపోవడం వేరుసెనగ పూర్తిగా నాశనం అయ్యిందన్నారు. తాను ఒక ఎకరా విస్తీర్ణంలో వేరుసెనగ సాగు చేయడానికి 24 వేల రూపాయలు పెట్టుబడి పెట్టడం జరిగిందని, పంట పూర్తిగా ఎండిపోవడంతో పశువులకు సైతం పనికి రాకుండా పోయిందన్నారు. ఈ క్రమంలో వ్యవసాయ శాఖ అక్టోబర్ నెలలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు విత్తనాలు ఇస్తామని చెప్పడంతో రైతులు ప్రత్యామ్నా పంటల సాగు చేశారని అయితే ఈ పంటలు సైతం రైతుకు కలిసిరాలేదన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం జిల్లాలో 16 మండలాలను కరవు మండలాలుగా ప్రకటించిందని, ఇందులో 3 మండలాలు తీవ్ర కరవు మండలాలు అని, 13 మధ్యస్థ కరవు మండలాలుగా ప్రకటించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కరవు బృంద సభ్యులు ఎంఎన్‌సిఎఫ్‌సి డిఎఅండ్‌ఎఫ్‌డబ్లు అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్, లైవ్ స్టోక్ హెల్త్ అసిస్టెంట్ కమీషనర్ డాక్టర్ దీపాంకర్‌సేట్ వాటర్ యూజర్స్ అండ్ రివర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ మన్నుజీ ఉపాధ్యాయ్, జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ మురళీకృష్ణ, జిల్లా పట్టు పరిశ్రమల శాఖ జెడి శోభారాణి, పశుసంవర్ధకశాఖ జెడి డాక్టర్ ప్రభాకర్, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, జిల్లా ప్రణాళిక అధికారి సాంబశివారెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ నరేంద్రకుమార్, జిల్లా భూగర్భజల శాఖ అధికారి గోవర్ధన్‌రెడ్డి, ఇరిగేషన్ డిఇఇ కెవిఎన్ ప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ రవికుమార్, యాదమరి తహసిల్దారు పార్థసారధి, ఎంపిడిఓ జె.వేణు, వ్యవసాయ అధికారి చరిత, ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.

# యూనివర్సిటీలకు వీసీల నియామక ప్రక్రియ షురూ...

## -సెర్చ్ కమిటీలను నియమిస్తూ గవర్నర్ కార్యాలయం ఉత్తర్వులు
## - త్రిసభ్య కమిటీలో యూజీసీ, ఈసీ, రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేసిన వ్యక్తుల నియామకం
## ఈ నెల ఆఖరిలోపు పూర్తి స్థాయి వీసీలను ప్రకటించే అవకాశం

తిరుపతి విద్య, జనవరి 8 ప్రభాతవార్త..

ఎన్నడూ లేని విధంగా యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్ల పోస్టులకు వందల సంఖ్యలో కుప్పలు తెప్పలుగా ధరఖాస్తులు వచ్చిపడ్డాయి. పోటీ తీవ్రతను గమనించిన ప్రభుత్వం వీసీల నియామకాలపై కాలయాపన చేస్తూ వచ్చింది. ఎట్టకేలకే ఉన్నత విద్యామండలి ఛైర్మన్ నియామకాన్ని పూర్తి చేసి వీసీల నియామక ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. జిల్లాలోని ఎస్వీయూ, పద్మావతి మహిళా వర్సిటీ, కుప్పం ద్రావిడ యునివర్సిటీల వీసీల నియామకం కోసం వేరువేరుగా త్రిసభ్య కమిటీలను నియమిస్తూ బుధవారం గవర్నర్ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీకి సంబంధంలేని వ్యక్తులను త్రిసభ్య కమిటీలో సభ్యులుగా నామినేట్ చేశారు.

### -ఎస్వీయూ సెర్చ్ కమిటీ:

రాష్ట్ర ప్రభుత్వం తరపున రాయ్పూర్కు చెందిన ఐఐఎం డైరెక్టర్ డాక్టర్ రామ్ కుమార్ కాకాని, ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్ తరపున ఎస్‌ఆర్‌ఎమ్ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ వీఎస్ రావు, యూజీసీ నియమించిన అహ్మదాబాద్ డాక్టర్ అంబేడ్కర్ ఓపన్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఆమి యూ ఉపాధ్యాయ సెర్చ్ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. పద్మావతి మహిళా వర్సిటీ సెర్చ్ కమిటీ: రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆదికవి నన్నయ్య వర్సిటీ మాజీ వీసీ కే నిరుపమరాణి, ఈసీ నామినేటేడ్ పర్సన్ హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, యూజీసీ తరపున మధ్యప్రదేశ్ డాక్టర్ హరిసింగ్ గౌర్ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ నీలిమా గుప్తాను నియమిస్తూ గవర్నర్ కార్యలయం ఉత్తర్వులు జారీ చేసింది.



### -కుప్పం ద్రావిడియన్ వర్సిటీకి:

రాష్ట్ర ప్రభుత్వం నియమించిన గౌహతికి చెందిన ఎన్‌ఐపీఈఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ యూఎస్ఎన్ మూర్తి, ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్ తరపున ఏపీఎస్సీహెచ్ఐ మాజీ వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ పి నరసింహా రావు, యూజీసీ తరపున ఢిల్లీకి చెందిన ఇన్స్టిట్యూట్ ఆఫ్ లివర్ అండ్ బిలియరీ సైన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్కె సరిన్ సెర్చ్ కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు.

### ఆశావాహుల్లో పెరిగిన టెన్షన్... !

ఉమ్మడి జిల్లాలోని మూడు వర్సిటీలకు వీసీల నియామక ప్రక్రియ ప్రారంభం కావడంతో ఆశావాహుల్లో రోజు రోజుకూ టెన్షన్ పెరుగుతోంది. ఇప్పటికే తమ అస్త్రశస్త్రాలను ఉపయోగించి విజయవాడ స్థాయిలో ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఎమ్మెల్యే, స్థానిక ప్రజా ప్రతినిధుల అండదండలతో రాష్ట్ర మంత్రులను కలసి తమకే వీసీగా అవకాశం ఇవ్వాలని విన్నవించుకుంటున్నారు. సీఎం అపాయింట్మెంట్ కోసం ఆశావాహులు పెద్ద సంఖ్యలో క్యూకడుతున్నట్లు సమాచారం. ఎస్వీయూ వీసీ పోస్టుకోసం సుమారు 250వరకు దరఖాస్తులు ఉన్నత విద్యామండలికి అందినట్లు విశ్వసనీయ సమాచారం. అలాగే మహిళా వర్సిటీకి 124, కుప్పం ద్రావిడియన్ వర్సిటీకి 98 మందికి పైగా రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. ఆశావాహుల భవితవ్యాలు ఈనెల ఆఖరు లోపు తేలిపోనున్నాయి.

## కిషోర బాలికలను మంచి మార్గంలో నడిపించాలి

యర్రావారిపాళెం, జనవరి 8 ప్రభాతవార్త



కిషోర బాలికలను మంచి మార్గంలో నడిపించేలా చర్య లు తీసుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఓ ప్రదీప అన్నారు. కిషోర వికాసంపై చంద్రగిరి ఐసిడిఎస్ పరిధిలోని యర్రావారిపాళెం మండలంలోని పలు వురికి స్థానిక స్త్రీశక్తి భవనంలో శిక్షణా కార్యక్ర మాన్ని నిర్వహిం చారు. కొందరు కిషోర పిల్లలు సైబర్ క్రైమ్ బారినపడి మాదకద్రవ్యాలకు అల వాటు పడుతున్నారనీ, వారి జీవితాలను నాశనం చేసుకొంటు న్నారన్నారు. వారిని సామాజిక రుగ్మతలనుంచి బయటపడే విధంగా కృషి చేయాలన్నారు. ఎసిడిపిఓ జ్యోతి, తహశీల్దార్, ఎంపిడిఓ, ఇఓపిఆర్డీ, తదితరులు పాల్గొన్నారు.

## దేశ ప్రజలకు కేంద్ర హోంమంత్రి క్షమాపణ

పాలసముద్రం, జనవరి 8 ప్రభాతవార్త:



రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవహేళన చేస్తూ మాట్లాడిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు సత్వరం క్షమాపణలు చెప్పాలని, అలాగే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని జిడి నెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ డి.రమేష్‌బాబు డిమాండ్ చేశారు. పాలసముద్రం దళితవాడలో బుధవారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పోటుగారి భాస్కర్, జిల్లా కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ రామ్‌భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిడినెల్లూరు నియోజకవర్గ కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ డి.రమేష్‌బాబు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో వుంచుకుని భారత రాజ్యాంగంను రచించిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవహేళన చేయడం కేంద్ర హోమ్‌మంత్రికి సంస్కారం కాదన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అందరివాడని ఆయన పేర్కొన్నారు.

## రెవెన్యూ సదస్సుల్లో 120 అర్జీలు

పాలసముద్రం, జనవరి 8 ప్రభాతవార్త:



క్షేత్ర స్థాయిలో భూసమస్యలను పరిశీలించి పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో పాలసముద్రం మండల పరిధిలో మొత్తం భూసమస్యలపై మొత్తం 120 అర్జీలు అందినట్లు తహసిల్దారు అరుణకుమారి పేర్కొన్నారు. మండల పరిధిలోబుధవారం పాలసముద్రం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సుతో సదస్సులు ముగిశాయి. ఈ సందర్భంగా తహసిల్దారు అరుణకుమారి మాట్లాడుతూ మండలంలో 19 రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగింది. ప్రతి రెవెన్యూ సదస్సులో రైతుల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించి వాటిని త్వరితంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. రీ-సర్వే డిటి ప్రవీణ్‌కుమార్, ఎంఆర్ఐ దేవి, మండల సర్వేయర్ గణేష్, విఆర్ఓ రమణయ్య, సర్వేయర్ హరి, ఎంపిటిసీ గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

## స్మశానానికి స్థలం కేటాయింపు

– రెవెన్యూ సదస్సులో ప్రజలు అధికారులకు విజ్ఞప్తి

శ్రీరంగరాజపురం, జనవరి 8 ప్రభాతవార్త:




ముదిగుప్పం పంచాయతీ చొక్కమడుగు గ్రామంలో చెరువులు, గుట్ట ప్రభుత్వ భూముల ఆక్రమణను తొలగించాలని, అలాగే ఎన్టీఆర్ కాలనీకి స్మశానం కోసం స్థలం కేటాయించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ముదిగుప్పం గ్రామంలో బుధవారం డిప్యూటీ తహసిల్దారు రవికుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు హాజరైన రైతులు, ప్రజలు మాట్లాడుతూ తమ గ్రామంలో రెవెన్యూకు సంబంధించి పలు సమస్యలు వున్నాయని వాటిని ప్రతిసారి పరిష్కరిస్తామని చెప్పే అధికారులు ఇప్పటి వరకు ఒక్క సమస్యను సైతం పరిష్కరించలేదన్నారు. ఈ సారి జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో మళ్ళీ తమ గ్రామంలోని భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నామని ఈ సారైనా అధికారులు స్పందించి రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ ఎస్సీ సెల్ నాయకుడు కుమార్, ఆర్ఐ ప్రభాకర్, విఆర్ఓలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## బీసీవై రామచంద్ర యాదవ్ చే వార్త క్యాలెండర్ ఆవిష్కరణ

పుంగనూరు, డిసెంబర్ 8, ప్రభాతవార్త



రాష్ట్ర భారతీయ చైతన్య యువజన పార్టీ అధ్యక్షులు రామచంద్ర యాదవ్ చే వార్త దినపత్రిక క్యాలెండర్ బుధవారం ఉదయం ఆవిష్కరించారు. పత్రికా రంగంలో ప్రత్యేక విలువలు కలిగి ఎందరికో మార్గదర్శకంగా నిలిచిన వార్త ఎడిటర్ మరియు రాష్ట్రవ్యాప్త పాత్రికేయ బృందాన్ని ఆయన అభినందించారు. పత్రికా రంగంలో వార్త దినపత్రిక మాత్రమే వినూత్నమైన ఒరవడిని సృష్టించిందని ఆయన తెలిపారు.

## మళ్లీ చిగురించిన ఆనాటి ఆస్నేహ మధురిమలు

మళ్లీ కలుసుకున్న 74 – 75 ఇంటర్ బ్యాచ్

పుంగనూరు, డిసెంబర్ 8, ప్రభాతవార్త



ఎప్పుడో 50 ఏళ్ల క్రితం విద్యార్థి దశ దాటిన తర్వాత విడిపోయిన స్నేహ బంధాలు మళ్లీ ఒకసారి కలుసుకున్నాయి. మనసు విప్పి మాట్లాడు కున్నాయి. ఆనందంతో ఉపితబ్బిబ్బయ్యాయి. 1974 – 75వ సంవత్సరంలో పుంగనూరు బసవరాజా పాఠశాలలో ఇంటర్మీడియట్ వరకు విద్యను అభ్యసించి, ఆరవ తరగతి నుంచి సహ విద్యార్థులుగా మెలిగిన వారందరూ బుధవారం పుంగనూరులో మళ్లీ ఒకసారి కలుసుకున్నారు. పట్టణంలోని సాయి లీల ఫంక్షన్ హాల్ లో జరిగిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనంతో ఆనందోత్సాహాలు వెల్లివిరిసింది. ఆరున్నర పదుల వయసు దాటిన పూర్వ విద్యార్థులందరూ గంటల తరబడి ముచ్చటించుకున్నారు. అందరూ కలిసి సహబంతి భోజనం చేశారు. ఒకరినొకరు మళ్ళీ మరొకసారి పరిచయం చేసుకున్నారు. ఒకరి చిరునామా మరొకరు ఒకరి ఫోన్ నెంబర్ మరొకరు తీసుకుని మళ్ళీ కలుద్దాం మిత్రమా అంటూ స్నేహపూర్వకంగా మాట్లాడుకుని పరవశించిపోయారు. ఈ అరుదైన అద్భుతమైన ఆరున్నరపదుల వయసుగల మిత్రులందరూ ఒక్క రోజంతా సంతోషంగా గడిపారు. మళ్ళీ బాల్యంలోకి వెళ్లిపోయారు. ఫోటో

## నిజాయితీకి నిలువుటద్దం వార్త

పుంగనూరు రూరల్, డిసెంబర్ 8, ప్రభాతవార్త



వార్త దినపత్రిక నిజాయితీకి నిలువుటద్దం లాంటిదని, ఎటువంటి పార్టీలు వర్గాలు అండదండలు లేకుండా ప్రజల కోసమే అంకితమైన నికార్సయిన పత్రిక వార్త అని విశ్రాంత డిఎస్పి, రాష్ట్ర వాల్మీకి సంఘ అధ్యక్షుడు, తెలుగుదేశం పార్టీ నాయకుడు కనుమకుంట సుకుమార్ బాబు అన్నారు. బుధవారం స్థానిక శ్రీ కళ్యాణ వెంకటరమణ స్వామి వారి ఆలయ ఆవరణలో వార్త క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని జిల్లా బిజెపి మైనార్టీ మోర్చా నాయకుడు పి అయుబ్ ఖాన్, ఏబీవీపీ రాష్ట్ర విభాగ మాజీ సభ్యుడు జీఆర్ విజయశంకర్‌ల సారథ్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్స్పెక్టర్ మునీంద్ర బాబు, అర్చకులు శ్రీనివాసచార్యులు, సిబ్బంది చెంగప్ప తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి - కాంగ్రెస్ నేతల ధర్నా

కుప్పంరూరల్, జనవరి 8 ప్రభాతవార్త



భారత రాజ్యాంగ నిర్మాత డా॥ అంబేద్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హో ం మంత్రి అమిత్‌షాను ప్రధాని మోడీ వెంటనే బర్తరఫ్ చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ డిమాండ్ చేశారు. పిసిసి చీఫ్ వైస్ షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం కుప్పంలోని డా॥ అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అ ంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. అనంతరం డిసిసి అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాతను తూలనాడే రీతిలో అమిత్‌షా మాట్లాడడం క్షమించరాని నేరమన్నారు. అమిత్‌షా హోంమంత్రి పదవికి అనర్హుడని పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆవుల గోపి, నేతలు మునస్వామి, నిజామ్, కృష్ణప్ప, తిమ్మప్ప, జయప్రకాష్, సుందరమూర్తి, మునివెంకట్, ఇమ్రాన్, మునిరామయ్య పాల్గొన్నారు.

## ముగిసిన అథ్లెటిక్స్ పోటీలు

చౌడేపల్లి, జనవరి 8 ప్రభాతవార్త



మండలంలోని పంచాయతీ కేంద్రం పుదిపట్ల వద్ద జరుగుతున్న జోనల్‌స్థాయి అథ్లెటిక్స్ పోటీలు బుధవారంతో ముగిశాయి. నియోజకవర్గ పరిధి లోని 6మండలాల నుంచి 400మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రోత్సాహకా లందించారు. ఎంఇఓలు కేశవరెడ్డి, తిరుమలమ్మ, తిరుమణపల్లి బాబురెడ్డి, పుదిపట్ల బాబురెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డిలు క్రీడాకారులకు భోజన వసతి కల్పించారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, ఎస్ఎంసి ఛేర్మన్ మనోహర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఉదయ్ కుమార్‌రెడ్డి, విశ్రాంత పిఇటి రామచంద్రయ్య, పిడి వెంకటేష్, రాజేంద్ర, నితిన్, మృదుల, పుంగనూరు, చౌడేపల్లి, సోమల, సదుం, రొంపిచర్ల, పులిచర్ల మండలాలకు చెందిన క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## యానాదిపాళెంలో వైద్య శిబిరం

చౌడేపల్లి, జనవరి 8 ప్రభాతవార్త



చౌడేపల్లి పరిధిలోని యానాదిపాళెంలో ఆరోగ్య కేంద్రం, పంచాయతీ అధికారులు సంయుక్తంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసారు. వైద్యాధికారి పవన్‌కుమార్ అందరికీ పరీక్షలు నిర్వహించి, వివిధ వ్యాధుల పడినవారికి మందులు పంపిణీ చేసారు. పంచాయతీ కార్యదర్శి మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. అనంతరం వారికి ఆరోగ్య సూత్రాలను వెల్లడించారు. ఆరోగ్య సూపర్‌వైజర్ బాహుద్దీన్, వైద్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు బోయకొండ గంగమ్మ ఆలయంలో హుండీ లెక్కింపు

చౌడేపల్లి, జనవరి 8 ప్రభాతవార్త

శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో ఈనెల 9న హుండీ లెక్కింపును నిర్వహించనున్నట్లు ఆలయ ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ అధికార, అర్చక, సిబ్బంది, హాజరు కావాలన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## సిఎం చంద్రబాబుకు సాదర వీడ్కోలు

కుప్పం, జనవరి 8 ప్రభాతవార్త



కుప్పంలో రెండు రోజుల పర్యటన నిమిత్తం వచ్చిన సిఎం చంద్రాబునాయుడు తన పర్యటనను విజయవంతంగా ముగించుకుని బుధవారం మధ్యాహ్నం 1.15గంటలకు ద్రవిడ వర్సిటీ హెలిప్యాడ్ నుంచి వైజాగ్‌కు బయలుదేరారు. ఈసందర్భంగా సిఎం చంద్రబాబుకు ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, అనంతపురం రేంజ్ డిఐజి షిమోషీ, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, జెసి విద్యాధరి, కడ పి.డి. వికాస్ మర్మత్, రాష్ట్ర వన్నియ కులక్షత్రియ కార్పోరేషన్ ఛైర్మన్ సిఆర్ రాజన్, ఎమ్మెల్యేలు షాజహాన్‌బాషా, వెంకటప్రసాద్, రాష్ట్ర నేత డా॥ సురేష్‌బాబు, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, మండలాల పార్టీ అధ్యక్షులు సాదర వీడ్కోలు పలికారు.

## భవిష్యత్తు తరాలకు కృత్రిమ మేధస్సుతోనే ఉద్యోగవకాశాలు

– జాతీయ సదస్సులో ఎస్‌పియస్ కళాశాల ప్రిన్సిపాల్, వైస్‌ప్రిన్సిపాల్

చిత్తూరురూరల్, జనవరి 8 ప్రభాతవార్త:



సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకునేవారి ప్రతి విద్యార్థి కెరీర్‌కు ఎలాంటి దోకా వుండదని, భవిష్యత్తు తరాలకు కృత్రిమ మేధస్సుతోనే ఉద్యోగ అవకాశాలు మెండుగా వుంటాయని ఎస్‌పి సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డా.కె. మనోహర్, వైస్‌ప్రిన్సిపాల్ నరేంద్రలు పేర్కొన్నారు. జిల్లా కేంద్రమైన చిత్తూరు ఎస్‌పి సావిత్రమ్మ కళాశాల నందు రెండురోజుల పాటు ఎస్‌పియస్ కళాశాల, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్‌సైన్స్ రీసెర్చ్‌లు సంయుక్తంగా కృత్రిమ మేధస్సుపై జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డైరెక్టరు చెన్నైకుమారి బొబ్బిలి సౌజన్య, ఆంధ్రవిశ్వవిద్యాలయం విశ్రాంత ప్రిన్సిపాల్ ఆచార్య బి అప్పారావు, మానవ వనరులశాఖ డైరెక్టరు విశ్రాంత ఆచార్యులు డా.ఎన్ఏడి పాల్, పీలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం. సుధాకర్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ మన చేతిలో వున్న మొబైల్‌లో గూగుల్ ద్వారా చాట్ జిపిటి, మెటా ఏఐ తదితర యాప్‌లతో అతి తక్కువ సమయంలో కొన్ని వందల పేజీల డేటాలను డౌన్‌లోడ్ చేసుకోగలమని, వీటితో పాటు కృత్రిమ మేదస్సు విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చాయని, కృత్రిమ మేధస్సును సరియైన మార్గంలో ఉపయోగించుకుంటే మనిషి ఉన్నత స్థాయికి చేరుతాడని, దానిని దుర్వినియోగం చేస్తే అది మానవ వినాశనానికి దారి తీస్తుందన్నారు. అలాగే విద్యార్థులకు ఈ కోర్సుల పట్ల వున్న అపోహలను వాస్తవాలను ఉదాహరణలతో విద్యార్థులు విపులంగా వివరించారు. చివరగా సదస్సుకు విచ్చేసిన అతిధులను కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, సదస్సు సంచాలకులు, అధ్యాపక బృందం ఘనంగా సత్కరించారు. కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## దాతృత్వాన్ని చాటుకున్న కారు డ్రైవర్ రామయ్య

గంగాధర నెల్లూరు 8 జనవరి ప్రభాతవార్త:



మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వపు విద్యార్థి అయిన కారు డ్రైవర్ రామయ్య పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు స్టడీ మెటిరియల్‌ను అందించి దాతృత్వాన్ని చాటాడు. వివారాల్లోకెళ్తే రామయ్య డ్రైవర్‌గా కారు నడిపి తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తాను చదువుకున్న పాఠశాల విద్యాభివృద్ధి సాధనలో తన వంతు సహకారం అందించాలని ఉద్దేశంతో తాను పొదుపు చేసిన డబ్బులు సుమారు 20 వేలు ఖర్చు పెట్టి పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు బుధవారం ప్రదానోపాధాయురాలు హేమలత చేతుల మీదుగా స్టడీ మెటీరియల్ అందించారు. రామయ్య దంపతులకు పాఠశాల బృందం సత్కరించారు. పాఠశాల కమిటీ సభ్యులు భాస్కర్ నాయుడు రమేష్ బాబు కుమరేషన్ ఉపాధ్యాయులు మధుసూధన్ రెడ్డి సెల్వ పాండ్యన్ నారాయణ రెడ్డి దినకర్ రమేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## 10న కమ్మగుట్టపల్లెలో వైకుంఠ ద్వార దర్శనం

పూతలపట్టు, జనవరి 8, ప్రభాతవార్త

పూతలపట్టు మండలం పరిధిలోని కమగుట్టపల్లె గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి వైకుంఠ ద్వార దర్శనం మహోత్సవం వైభవంగా దేవస్థానం కమిటీ సభ్యులు కమగుట్టపల్లి గ్రామస్తులు ప్రజలు నిర్వహించినట్లు పూతలపట్టు మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గుంటూరు మురళి తెలిపారు. వైకుంఠ ఏకాదశి అనగా 2025 జనవరి 10 శుక్రవారం 11వ తేదీ శనివారం భక్తులకు స్వామి వారి ఉత్సవం మూర్తులకు ప్రత్యేక అభిషేకం భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. 2025 జనవరి 10వ తేదీ శుక్రవారం ఉదయత్వం మూడు గంటల కు ఉత్సవ మూర్తి అభిషేకం ఉదయం 6 నుండి 8 గంటలకు మూలమూర్తి అభిషేకం అర్చన హారతి నిరాజనం ప్రసాద నివేదిక తదంతరం మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం రెండు గంటలకు భజన కార్యక్రమం పూతలపట్టు బృందంచే 4 గంటలకు అన్నమాచార్య కీర్తన, హరికథ తిరుపతి తిరుమల దేవస్థాన కళాకారులచే రాత్రి 8 గంటలకు అల్పాహారం 11వ శనివారం ఉదయం 10 గంటలకు చక్రస్నానం తదుపరి స్వామి వారి వాహన సేవ మరియు ఊరేగింపు జరుగును. కార్యక్రమాల నిర్వాహకులు విజయం సంస్థ అధినేత తేజ మూర్తి దంపతులు తేజ డైరీ ఓనర్ నీరజార్చుల నాయుడు, పులిగుండు దంపతులు నాగిరెడ్డిపల్లి శంకర్ నాయుడు, దంపతులు పాల్గొన్నారు.

## తెదేపా కార్యకర్తల కుటుంబాలకు ఆర్థికసాయం

రామకుప్పం, జనవరి 8 ప్రభాతవార్త



మండలంలోని రాజుపేటకు చెందిన వెంకటమ్మ, బళ్లకు చెందిన గురునాథప్పలు అనారోగ్యంతో మృతి చెందారు. వీరు తెదేపా కార్యకర్తలు కావడంతో తెలుగుదేశం పార్టీ నేతలు ఆయా గ్రామాలకు చేరుకుని మృతదేహాలకు నివాళులు అర్పించారు. అనంతరం ఒక్కో కుటుంబానికి పదివేల రూపాయల వంతున ఆర్థికసాయం అందించారు.

కార్యక్రమంలో రాష్ట్ర నేత మునస్వామి, నరసింహులు,జయశంకర్, నాగభూషణం, నారాయణస్వామి, అప్పి పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ట్రాఫిక్ డిఎస్పి రామకృష్ణాచారి

తిరుపతి కార్పొరేషన్, జనవరి 8, ప్రభాతవార్త

ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ట్రాఫిక్ డిఎస్పి రామకృష్ణాచారి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ డిఎస్పి మాట్లాడుతూ ప్రజలు ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు అన్నారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఆదేశాల మేరకు ట్రాఫిక్ డిఎస్పి రామకృష్ణచారి, కేసుల వివరాలు వెల్లడించారు. తిరుపతి పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపిన డ్రైవర్ల పై ట్రాఫిక్ పోలీసు వారు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేసి 38 మంది ముద్దాయిలను మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి తీర్పు నిచ్చారు. ఒక్కొక్కరికి 10,000 చొప్పున మొత్తం 38 మందికి 3,80,000 జరిమానా విధించారు. అలాగే రోడ్డుకి ఇరువైపులా వాహనదాలకు పాదచారులకు అడ్డం కలిగిస్తూ రోడ్డు పైన వ్యాపారాలు చేసే వాళ్ళకి ఒక్కొకరికి 500 చొప్పున 22 మందికి 11,000 జరిమానాను విధించారు.

## ఎన్డీయే పాలనలో జోరుగా అభివృద్ధి గంజి మాధవయ్య

పుత్తూరు, జనవరి 8 ప్రభాతవార్త :



ఎన్టీయే పాలనలో గ్రామీణాభివృద్ధి జోరుగా జరుగుతోందని పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, పుత్తూరు మాజీ ఎంపిపి గంజి మాధవయ్య అన్నారు. మండలంలోని కెబిఆర్ పురం గ్రామంలో ఉపాధి హామీ నిధులు రూ. 5.20 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో సిమెంట్ రోడ్లను నిర్మిస్తున్నామని తెలిపారు. కెబిఆర్ పురం పంచాయతీలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు అనుకూలంగా వుండే విధంగా సిసి రోడ్లు వేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో టిడిపి రూరల్ విభా గంప్రధానకార్యదర్శిఎ. బాలాజీ,నాయకులు వెంకటరమణ, మునికృష్ణ పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

పుత్తూరు, జనవరి 8 ప్రభాతవార్త :



పుత్తూరు ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని గొల్లపల్లి గ్రామంలోని స్థానిక ఉన్నత పాఠశాలలో జరిగిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. తిరుపతికి చెందిన వాసన్ ఐ కేర్, మాధురి రెమెడి ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన శిబిరంలో 500 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరక్టర్ గంజి మాధవయ్య, ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పి.రవిరాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచిత వైద్యులు అందిస్తున్న ఉషోదయ వాకర్స్ అసోసియేషన్‌ను అభినందించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేటి రవిరాజు, వాసన్ ఐ కేర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ అలోక్‌కుమార్ గుప్తా, పిఆర్వో వెంకటేష్, మాధురి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ అభిషేక్, డాక్టర్ కళావతి, డాక్టర్ లోకేష్, అసోసియేషన్ అధ్యక్షుడు బాబు, కార్యదర్శి రామ్మోహన్‌వర్మ, ఉపాధ్యక్షుడు చంద్రబాబు, సభ్యులు రామచంద్రరాజు, పాఠశాల హెచ్ఎం బి.భారతి, పలువురు ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## భక్తిభావం పెంపొందించేది ప్రవచనాలు

–ఆచార్య రంగనాథ్

తిరుపతి(రవాణ),జనవరి 8ప్రభాతవార్త:



కలియుగంలో మనుషుల్లో భక్తిభావం పెంపొందించేది భక్తిపురాణాల ప్రవచనాల తోనేనని ప్రవచనకర్త ఆచార్య రంగనాథ్ అన్నారు. ధనుర్మాసం సందర్భంగా అన్నమాచార్యకళా మందిరంలో ప్రతిరోజూ తిరుప్పావై ప్రవచనాలను ఆయన భక్తులకు భక్తిభావంతో పారాయణం చేస్తున్నారు. మనుషుల్లో భక్తితోనే మానవత్వం పరిమళిస్తుందని, అది లోకకల్యాణానికి దారితీస్తుందని అన్నారు. బుధవారం తిరుప్పావై పారాయణం సందర్భంగా రాయలసీమ రంగస్థలిఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, కెఎన్‌రాజ, ఈశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కస్పా పద్మనాభం, సామ్రాజ్యం సురేష్, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, నరసింహయాదవ్, చిత్రపు హనుమంతరావు ప్రవచనకర్తను సన్మానించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

## నాలుగేళ్ళుగా పునాదులు దాటని వరదరాజస్వామి గుడి

మొక్కుబడిగా వైకుంఠ ఏకాదశి



శ్రీకాళహస్తి,జనవరి 8 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహించబడుతున్న ప్రసన్న వరదరాజస్వామికి కొత్త ఆలయం కట్టించాలని గత పాలకులు నిర్ణయించారు. దాంతో మూడేళ్ళ క్రితం ఉన్న పురాతన కాలం నాటి ప్రసన్న వరదరాజస్వామి ఆలయాన్ని పడగొట్టారు. ఏడాదిలో పూర్తి చేయుటకు రూ.7కోట్లతో నిర్ణయించారు.అర్హత లేని వారికి పనులు కట్టబెట్టారు. ఒరెండేళ్ళ పాటు కుప్పం నుంచి రాయి వివాదం చోటు చేసుకుంది. ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పనుల్లో వేగం పెంచాలని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఆదేశించారు. పనుల్లో అనుభవం ఉన్న కాంట్రాక్టర్‌కు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం కుప్పం నుంచి రాయి భారీ ఎత్తున వచ్చింది. దానిని స్కిట్ కళాశాల ఆవరణలో డంప్ చేస్తున్నారు.అయితే శిల్పి పనులు చేసే కార్మికుల రావటం ఏదో ఒక అవాంతరంతో వెళ్ళటంతో జాప్యం జరుగుతుంది. 18 లేయర్ల పనికి గాను ఇప్పటి వరకు కేవలం 3 లేయర్లు మాత్రమే పూర్తి చేసారు. అంటే ఒక్కొక్క లేయర్‌కు ఒక్కొక్క సంవత్సరం పట్టింది. 15లేయర్లు పూర్తి చేయాలంటే మరో 15 సంవత్సరాలు పడుతుందేమో?

**మొక్కుబడిగా వైకుంఠ ఏకాదశి:**

సాధారణంగా వైకుంఠ ఏకాదశి అంటే ప్రసన్న వరదరాజస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం చేసుకునేందుకు విస్తృత ఏర్పాట్లు చేసే వారు. కానీ మూడేళ్ళుగా బాలాలయంలో నిర్వహిస్తున్నారు. అది కూడా ఆలయ ఆవరణ అంతా కొత్త ఆలయ నిర్మాణానికి సంబంధించిన రాయి అడ్డదిడ్డంగా వేసి ఉన్నారు. దాంతో ఉత్తర ద్వార దర్శనం వైకుంఠనాధుని దర్శనానికి వంకర టింకర క్యూలైన్లను ఏర్పాటు చేసారు. వైకుంఠ ఏకాదశి వస్తుందంటే అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకొని ఉండాల్సింది. కనీసం క్యూలైన్లు సక్రమంగా నిర్మించుటకు అవసరమైన అడ్డంకులను తొలగించి ఉండాల్సింది. కానీ ఎందుకో అధికారులు చొరవ చూపలేదు. అయితే క్యూలైన్లు, షామియానాలు ఏర్పాటు చేసి ఉన్నారు. తిరుమలేశుని దర్శనానికి వెళ్ళలేని భక్తులు ఇక్కడే దర్శించుకుంటారు. అయితే ప్రస్తుతం టిటిడికి అనుబంధంగా ఉన్న తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి,భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళుతున్నారు. ఈ ఏడాది అక్కడ విస్తృ ఏర్పాట్లు చేపట్టారు. ఆలయాన్ని అందంగా తీర్చి దిద్దుతున్నారు. వేకువ జాము నుంచి దర్శనాలకు అనుమతించుటకు సన్నాహాలు చేస్తున్నారు.

## మెడికల్ అసోసియేషన్‌చే దుప్పట్లు పంపిణి

శ్రీకాళహస్తి,జనవరి 8 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మెడికల్ అసోసియేషన్‌చే సామాజిక కార్యక్రమాల్లో భాగంగా బుధవారం బాలికల హాస్టల్‌లో ఉంటున్న బాలికలకు ఉచితంగా దుప్పట్లు అందించారు. సుమారు5 నెలలుగా మెడికల్ అసోసియేషన్ సారధ్యంలో పలు సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు బొమ్మన మధుసూదనరావు వివరించారు. ప్రస్తుతం చలి కాలం కాబట్టి చుట్టుపక్కల గ్రామాల నుంచి శ్రీకాళహస్తిలోని వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్నారని వారికి సంబంధించిన అన్ని సమస్యలు పరిష్కరించలేము కానీ తమ వంతు సహాయంగా దుప్పట్లు అందించినట్లు ఆయన వివరించారు. వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన మందులను అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో మధుసూధనరావుతో పాటు జిల్లా కార్యదర్శి రాముా గుప్తా, ఉపాధ్యక్షులుఅమరా జనార్ధన్, నరసింహారాజు(నంద) కార్యదర్శి కొండేటి గోపాల్, కోశాధికారి కార్తీక్‌రెడ్డి, కొండేటి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు

## కాట్రపల్లిలో 10న వైకుంఠ ఏకాదశి పూజలు

శ్రీకాళహస్తి,జనవరి 8 ప్రభాతవార్త

శ్రీకాళహస్తికి సమీపంలోని కాట్రపల్లి గ్రామంలో ఈ నెల 10న వైకుంఠ ఏకాదశి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నామని రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్ బుధ వారం తెలిపారు. ఎంతో ప్రసిద్ధి చెందిన కాట్రపల్లి గ్రామంలో చక్కటి ఆలయం నిర్మించామన్నారు. ఈ ఆలయంలో పూజలు, అభిషేకాలు, దర్శనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే మధ్యాహ్నం సహ పంక్తి భోజనాలతో పాటు వైకుంఠ నాధుని ఉత్సవ మూర్తుల ఊరేగింపు జరుగుతుందని వివరించారు.

## ఒంగోలులో ఇజితిమా: శ్రీకాళహస్తి నుంచి కదలుతున్న ముస్లింలు

శ్రీకాళహస్తి,జనవరి 8 ప్రభాతవార్త



ఒంగోలులో గురువారం నుంచి శనివారం మధ్యాహ్నం వరకు ముస్లిం సనాతన మహాసభలు (ఇజితిమా) జరగనున్నట్లు ముఫ్తినయిం సాహెబ్ బుధవారం వివరించారు. ప్రతి ఏడాది ఏదో ఒక చోట ఇజితిమా నిర్వహించి దైవ మార్గంలో మూడు నెలలు, 40రోజులు, ఏడాది జమాత్‌లు ఖరారు చేయటం ఆనవాయితి. ఇస్లాం మతం గురించి దైవ ప్రవక్తల ప్రోబోధాలను మత గురువులు బోధిస్తారు. ఒక్కొక్క సంవత్సరం ఒక్కొక్క జిల్లా కేంద్రంలో ఇజితిమాలు నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో ఈ ఏడాది జనవరి 10 నుంచి 12వరకు ఒంగోలులో నిర్వహించుటకు మత సభ తీర్మానించిం దన్నారు. ఒక నెలగా శ్రీకాళహస్తిలోని అన్ని మసీదుల్లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా మత గురువులు పిలుపు నిచ్చారు. గురువారం మధ్యాహ్నం నుంచి సనాతన సభలు ప్రారంభమౌతాయని శనివారం మధ్యాహ్నం నమాజులో ప్రత్యేక ప్రార్థనలు ముగింపు ఉంటుందని వివరించారు.

## సంక్రాంతి పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానం

తిరుపతి విద్య జనవరి 8 ప్రభాతవార్త:

సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరిం చుకొని రెండు తెలుగు రాష్ట్రాలలో సమా జానికి సేవ చేస్తున్న సమాజ సేవకులను గుర్తించి వారికి సంక్రాంతి పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సర్వేజనా సుఖీనోభవంతు వ్యవస్థాపకులు డాక్టర్ ఈఎస్ఎన్ నారాయణ పిలుపునిచ్చారు. ఈ దరఖాస్తులకు ఉపాధ్యాయులు, వైద్యులు, ఇంజనీర్లు, యోగ మెడిటేషన్, సంగీత, నృత్యకళాకారులు, సినీ టీవీ రంగా కళాకారులు, కవులు, రచయితలు, క్రీడాకారులు వివిధ విభాగాలకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. పురస్కారాల ఎంపిక కోసం సమాజ సేవ సాహిత్యం, సంగీతం, నృత్యం, కలలు, క్రీడలు, విద్యా, వైద్యం, యోగ, కరాటి, మెమరీ పవర్ లాంటి వివిధ రంగాలలో ప్రతిభావంతులైన వారి సేవలు తెలియజేసే సర్టిఫికెట్స్ ఫోటోలు, పత్రికా క్లిప్పింగ్స్ జిరాక్స్ కాపీలతో నాలుగు పాస్పోర్ట్ సైజు ఫోటోలతో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈనెల 10 లోపు తమ అడ్రస్ కు లేదా ఈ క్రింది 9652347207 ఫోన్ నెంబర్ ను సంప్రదించాలని కోరారు.

## పశు వైద్య వర్సిటీలో పోటా పోటీగా క్రీడ, సాంస్కృతిక కార్యక్రమాలు.

తిరుపతి విద్య జనవరి 8 ప్రభాతవార్త:

పశువైద్య వర్సిటీలో పశు వైద్య కళాశాల వేదికగా 13 అంతర్ కళాశాలల క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు తీవ్ర ఉత్కంఠతో పోటాపోటీగా మూడవరోజు ప్రారంభమయ్యాయి. మూడవరోజు కార్యక్రమంలో భాగంగా వివిధ విభాగాలలో పురుషులు, మహిళలు రన్నింగ్షార్ట్ పుట్, త్రిబుల్ జంప్, డిస్క్ త్రో, వాలీబాల్, బాస్కెట్బాల్, టేబుల్ టెన్నిస్, టెన్నికాయిట్, బాల్ బ్యాట్మెంటన్, షటిల్ బ్యాట్మెంటన్ వంటి వివిధ విభాగాల్లో పోటాపటిగా తీవ్ర ఉత్కంఠతో నిర్వహించబడ్డాయి. ఈ విభాగాలలో సుమారు 490 మంది విద్యార్థిని విద్యార్థులు నాలుగు పశు వైద్య కళాశాల నుండి ఒక డైరీ టెక్నాలజీ కాలేజీ పాల్గొని తమ సత్తా చాటారు. క్రీడా అథ్లెటిక్స్ మరియు సాంస్క ృతిక కార్యక్రమాల్లో నిబంధనలు అనుసరించి అవాంతరాలు అపోహలు తలెత్తకుండా చూసుకుంటున్నట్లు అసోసియేట్ డీన్ డాక్టర్ పి జగపతిరామయ్య, పశు వైద్య కళాశాల పిడి జై చంద్ర తెలిపారు.

## ప్రగతి ప్రదాతలకు ప్రణామాలు

శ్రీకాళహస్తి, జనవరి 8 ప్రభాతవార్త



గడచిన ఐదు సంవత్సరాల్లో విధ్వంసానికి చిరునామాగా మారి పోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని వికాసం వైపు పరుగులు తీయిస్తున్న ఎన్డీయే కూటమి ప్రగతి ప్రధాతలకు ప్రణామాలు తెలియజేస్తున్నామని తెలుగుదేశం పార్టీబిసి విభాగం నాయకులు పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలోపూ ఇప్పటి వరకు జరగని విధంగా సుమారు రెండు లక్షల కోట్లుతో విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలును మరియు ప్రారంభోత్సవ కార్యక్రమాలను ప్రధాన మంత్రి నరేంద్రమోడి చేతులమీదుగా విశాఖపట్నంలో నిర్వహిస్తున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక పూసలవీధి కూడలిలో తెలుగుదేశంపార్టీ నాయకులు స్వీట్లు పంచిపెట్టుకున్నారు. కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌మిన్నల్‌రవి, తెలుగుదేశంపార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు, సాంస్కృతిక రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు.సుబ్రమణ్యం(బుజ్జి), నాయిబ్రాహ్మణసాధికార సమితి కమిటీ తిరుపతి పార్లమెంటు సోషల్‌మీడియా కన్వీనర్ కోటచంద్రశేఖర్, బిసివిభాగం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మునిరాజయాదవ్, పట్టణ సహకార బ్యాంకు మాజీ వైస్ ఛైర్మన్ షేక్ ఖాదర్‌బాషా, తిరుపతి పార్లమెంటు నాయకులు బీమాల భాస్కర్, మణి, రామచంద్రయ్య, కృష్ణమూర్తి, శేఖర్, శివ, రమేష్, మాజీ కౌన్సిలర్ మహబూబ్‌బాషా, మైనార్టీ విభాగం తిరుపతి పార్ల మెంటునాయకులుసయ్యద్ చాంద్‌బాషా, నూర్‌మహ్మద్, సులేమాన్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ల్యాబ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

తొట్టంబేడు, జనవరి 8 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సయ్యద్.షకీల్ అలీను ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. గత అధ్యక్షుడి పదవీకాలం ముగియడంతో నూతన అధ్యక్షుడు షకీల్ అలీ, ఉపాధ్యక్షుడుగా ఎస్.హరీష్‌బాషాలను కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో టెక్నిషియన్లు హబీబ్‌బాషా, మురళీనాయుడు మరియు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసంకల్ప వేదిక రాష్ట్రసలహదారుగా కృష్ణమూర్తి

శ్రీకాళహస్తి, జనవరి 8 ప్రభాతవార్త



ప్రజా సంకల్ప వేదిక అవినీతి నిరోధకశాఖ రాష్ట్ర సలహాదారుగా శ్రీకాళహస్తికి చెందిన డి.కృష్ణమూర్తిని నియమిస్తూ మదిరె రంగసాయిరెడ్డి నియామకపత్రం అందించారు. శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన డి.కృష్ణమూర్తి ప్రజా సంకల్ప వేదిక అవినీతి నిరోధక శాఖ రాష్ట్ర సలహదారుగా ఎన్నికైనట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రజాసంకల్ప వేదిక ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈనేపథ్యంలో ప్రజా సంకల్ప వేదిక అవినీతి నిరోధక రాష్ట్ర అధ్యక్షుడు రంగసాయిరెడ్డికి కృష్ణమూర్తి తెలిపారు. ఈసందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర సలహాదారుగా తనపై ఉంచిన నమ్మకాన్ని తనకు ఈ పదవి ఇచ్చినందుకు బలోపేతం చేసి ప్రజా సంకల్ప వేదిక అభివృద్ధికి దోహదపడుతాయని అన్నారు. ప్రజా సంకల్ప వేదిక సిబ్బందికి అభినందనలు తెలిపారు.

## భక్తిభావం పెంపొందించేది ప్రవచనాలు

–ఆచార్య రంగనాథ్



తిరుపతి(రవాణ),జనవరి 8ప్రభాతవార్త:

కలియుగంలో మనుషుల్లో భక్తిబావం పెంపొందించేది భక్తిపురాణాల ప్రవచనాల తోనేనని ప్రవచనకర్త ఆచార్య రంగనాథ్ అన్నారు. ధనుర్మాసం సందర్భంగా అన్నమాచార్యకళామందిరంలో ప్రతిరోజూ తిరుప్పావై ప్రవచనాలను ఆయన భక్తులకు భక్తిభావంతో పారాయణం చేస్తున్నారు. మనుషుల్లో భక్తితోనే మానవత్వం పరిమళిస్తుందని, అది లోకకల్యాణానికి దారితీస్తుందని అన్నారు. బుధవారం తిరుప్పావై పారాయణం సందర్భంగా రాయలసీమ రంగస్థలిఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి, కెఎన్‌రాజ, ఈశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కస్పా పద్మనాభం, సామ్రాజ్యం సురేష్, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, నరసింహయాదవ్, చిత్రపు హనుమంతరావు ప్రవచనకర్తను సన్మానించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

## కిషోర వికాసం ..

బాలల హక్కుల పరిరక్షణ .. ఐసిడిఎస్ సిడిపిఓ ప్రదీప

చంద్రగిరి, జనవరి 8 ప్రభాతవార్త:



బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 సమర్థవంతంగా అమలు కిషోర వికాసం లక్ష్యమని ఐసిడిఎస్ సిడిపిఓ ప్రదీప అన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం బుధవారం వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్లకు, మహిళా సంరక్షణ కార్యదర్శులకు ఏఎన్ఎంలకు, నోడల్ టీచర్‌లకు, లెక్చరర్లస్‌కు, వెలుగు సిబ్బందికి, అంగన్‌వాడీ టీచర్లకు కిషోర వికాసంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కౌమారదశ, రక్తహీనత, రుతుక్రమ పరిశుభ్రత, బాలల అక్రమ రవాణా వంటి అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కొంత మంది సైబర్ నేరాల బారినపడి మాదకద్రవ్యాలకు బానిసలుగా మారుతూ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నట్లు తెలిపారు. మండల స్థాయిలోని అన్ని విభాగాలు తమవంతు కృషితో బాలికలను సంరక్షించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శేఖర్, ఎంఈఓ శ్రీవరం లలితకుమారి, ఎసిడిపిఓ జ్యోతి, ఈఓపిఆర్‌డి వెంకటరత్నం, ఎంపిహెచ్ఎన్ చింతామణి, నోడల్ టీచర్ పిఆర్ మూర్తి, బాలికల జూనియర్ కళాశాల అధ్యాపకుడు ప్రసాద్, స్వమాక్స్ సిఈఓ సంగీతం విశ్వనాథ్, సూపర్‌వైజర్స్ అనితవాణి, నాగమణి, పావనిశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులో 99 భూ సమస్యలు పరిష్కారం

రేణిగుంట జనవరి 8 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులు గత సంవత్సరం డిసెంబర్ 6 తేదీ ప్రారంభమై జనవరి 8 తేదీ బుధవారంతో ముగిశాయి. రేణిగుంట మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో సదస్సులను తహసిల్దార్ సురేష్ బాబు వివిధ శాఖల అధికారులతో నిర్వహించి పలు భూ సమస్యలను పరిష్కరించారు. సదస్సులో 204 అర్జీలు వచ్చాయని వీటిలో 99 భూ సమస్యలను పరిష్కరించామని మిగిలిన 105 సమస్యలు పరిశీలనలో ఉన్నాయని తాహాసిల్దార్ తెలిపారు. ఆర్జిటి 2. భూ సమస్యలను పరిష్కరిస్తున్న తహసీల్దార్.

## విశ్రాంతి ఉద్యోగుల ఆరోగ్య సమస్యలు పరిష్కరించండి...

రేణిగుంట జనవరి 8 ప్రభాతవార్త



రైల్వే శాఖలోఉద్యోగాలు నిర్వహిస్తూ రిటైర్డ్ అయిన విశ్రాంతి ఉద్యోగుల, కార్మికుల వైద్య పర సమస్యలతో పాటు వైద్య సేవలు అందించడానికి కృషి చేయాలని సిఆర్ఎస్ బ్రాంచ్ ఏఐఆర్ఆర్ఎఫ్ విశ్రాంత ఉద్యోగులు విజ్ఞప్తి చేశారు. రేణిగుంట (తిరుపతి)సిఆర్ఎస్‌కు బుధవారం వచ్చిన సౌత్ సెంట్రల్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ నిర్మల రాజారాం, గుంతకల్ కు సంబంధించిన రైల్వే చీఫ్ మెడికల్ సూపరింటిన్డెంట్ వేణుగోపాల రైల్వేశాఖ ఉద్యోగులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రైల్వే విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొం టున్న పలు వైద్య సమస్యలను వారికి తెలియజేశారు. తమ సమస్యలు వైద్యులు జాప్యం చేస్తున్నారని వివరించారు. అనంతరం వారిని ఘనంగా సత్కరిస్తూ వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆర్ విజయ్ కుమార్, ఛైర్మన్ గజపతి నాయుడు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి సిపాయి భరోసా...

రేణిగుంట జనవరి 8 ప్రభాతవార్త



రేణిగుంట పట్టణంలో ఇటీవల మృతి చెందిన అమరావతి కుటుంబ సభ్యులను బుధవారం ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పరామర్శించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులకు 40 రకాల నిత్యవసర సరుకులను డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బాబు, ఏర్పేడు మాజీ ఎంపీటీసీ మునిరత్నం రెడ్డి, శివ, వెంకటేశ్వర్లు, వెంకటేష్, బాబు, సూరి తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రి ప్రాంగణంలో విద్యుత్ దీపాలు...

రేణిగుంట జనవరి 8 ప్రభాతవార్త రేణిగుంట

ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ప్రాంగణంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు పంచాయితీ అధికా రులు బుధవారం యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. గత కొన్ని నెలలుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విద్యుత్ దీపాలు వెలగక ఆ పరిసర ప్రాంతాలు చిమ్మ చీకట్లో ఉండేది. పాములు, పందులు తదితర జీవాలు ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నాయని వైద్యశాఖ అధికారులు ఆ ప్రాంత ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి అధికారులను ఆదేశించడంతో పంచాయతీ కార్యదర్శి మణి తక్షణం స్పందించి యుద్ధ ప్రాతిపదికన వీధి దీపాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆసుపత్రి ప్రాంగణం వీధి దీపాలతో జిగేల్ ఉంటుంది. ఆర్జిటి4. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం.

## చెడుకు దూరంగా ఉన్నత లక్ష్యం వైపు అడుగులు పడాలి

తిరుపతి విద్య జనవరి 8 ప్రభాత వార్త



విద్యార్థులు చెడుకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యం వైపు అడుగు లు వేయాలని మాజీ సీబీఐ జేడీ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. బుధ వారం ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియం వేదికగా ఏపీ స్టూడెంట్స్ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన ప్రతిభా అవార్డుల ప్రధానోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ టెక్నాలజీని సరైన మార్గంలో ఉపయోగించుకోవాలన్నారు. విద్యార్థి దశ కీలమైందని జీవిత లక్ష్యాన్ని ఛేదించి దేశ సేవలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులను ప్రోత్సహించే క్రమంలో స్టూడెంట్స్ జేఏసీ ప్రతిభా పురస్కారాలు అందించడం అభినందనీయమన్నారు. అనంతరం జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు హేమాద్రి యాదవ్ మాట్లాడుతూ తిరుపతి నగరంలో ఇంటర్ నుంచి పీజీ వరకు అకడమిక్ విద్యలో ప్రతిభ చూపిన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించేందుకు ప్రతిభా అవార్డు ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం వివిధ తరగతులలో ప్రతిభ చూసిన విద్యార్థులకు ముఖ్యఅతిథుల చేతుల మీదుగా అవార్డులు, నగదు బహుమతులను ప్రధానం చేశారు. జేఏసీ జిల్లా అధ్యక్షులు గార్లపాటి శ్రీధర్, వర్సిటీ అధ్యక్షులు మల్లి ఉపేంద్ర, ఉపాధ్యక్షులు శ్రీను, నగర అధ్యక్షులు వెంకటేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 10న వైకుంఠ ఏకాదశి: శేషవాహన సేవ

శ్రీకాళహస్తి,జనవరి 8 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 10 శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామి అమ్మవార్ల శేష వాహన సేవను నిర్వహించబడుతుందని ఆలయ ఇఒ టి.బాపిరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఆలయానికి సంబంధించి ధార్మిక కార్యక్రమాలకు పెద్ద పీట వేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ నెల సంక్రాంతి పండగ లోపల పలు సంప్రదాయ ఆధ్మాత్మిక కార్యక్రమాలు నిర్వహించబడుతుందన్నారు. ఈనెల 10న ఉదయం వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామి అమ్మవార్లను శేష వాహన సేవను నిర్వహి స్తామన్నారు. తరువాత వెంటన గౌరమ్మ గ్రామోత్సవం ఉంటుందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. వచ్చిన ప్రతి భక్తుడు స్వామి అమ్మవార్లను మనసార దర్శించుకునేటట్లు ఏర్పాట్లు చేసామన్నారు. ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేసినట్లు ఇఒ వివరించారు

## గౌరమ్మ గ్రామోత్సవం:



శ్రీకాళహస్తి,జనవరి 8 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం ఉదయం గౌరమ్మ గ్రామోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం మొదటి ఒరెండు కాలాల అభిషేకాలను నిర్వహించిన తరువాత అమ్మవారికి అలంకార మ ండపంలో చక్కగా తీర్చి దిద్దారు. ఆలంకార గురుకుల్స్ అమ్మవారిని కన్నుల మిరుమిట్లు గొల్పునట్లు అలంకరించి గ్రామోత్సవానికి తరలించారు. ఆలయ ఇన్స్ పెక్టర్ సుదర్శనం నాయుడు, దఫేదార్ భద్రయ్య రజనీ సిబ్బంది వెంటరాగా ఉత్సవాన్ని తేరువీధి నుంచి సాగించారు. నాలుగుమాడావీధుల్లో ఇంటింటి వద్ద అమ్మవారికి హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

## నాన్‌టీచింగ్ అసోసియేషన్ క్యాలెండర్లు ఆవిష్కరణ

తొట్టంబేడు, జనవరి 8 ప్రభాతవార్త

నాన్ టీచింగ్ అసోసియేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా నూతన సంవత్సర క్యాలెండర్లను బుధవారం ఆర్ఐఓ ప్రభాకర్‌రెడ్డి, డిఐఈఓ విశ్వనాథ్‌నాయక్, లైబ్రేరియన్ సోమశేఖర్‌ల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాన్‌టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి, సభ్యులు మధుసూధన్, శంకర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మంజునాథ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## రీ సర్వేపై సి.గొల్లపల్లిలో అవగాహన ర్యాలీ

తిరుపతిరూరల్, జనవరి08 ప్రభాతవార్త:




సర్వేలో నెలకున్న సమస్యలను పరిష్కరిం చుటకు రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని రీ సర్వే డి.టి.మోహన్‌బాబు తెలిపారు. రీ–సర్వేపై అవగాహన ర్యాలీని బుధవారం తిరుపతిరూరల్ సి.గొల్లపల్లి గ్రామ పంచాయతీలో నిర్వహించారు. సంక్రాంతి పండగలు తర్వాత తిరుపతిరూరల్ మండలంలో రీ–సర్వే ప్రారంభమైతుందని తెలిపారు. ఈ ర్యాలీలో గ్రామ సర్పంచ్ విడుదల రవికుమార్‌రెడ్డి, వైస్ సర్పంచ్ చెంగారెడ్డి, మండల సర్వేయర్ హేమకుమార్, విఆర్వో మురళి, విలేజ్ సర్వేయర్ భరణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఈ చెత్తకు బాధ్యత ఎవరు తీసుకుంటారు

పాకాల, జనవరి 8, ప్రభాతవార్త



పాకాల మండలం మీదుగా చిత్తూరు టు తిరుపతి ఎన్ హెచ్ 140 ఆరు లైన్లో హైవే లో గాదంకి టోల్ ప్లాజా వద్ద రోడ్డు కిరువైపులా షాపుల నుంచి వచ్చే చెత్త చెదారం పెద్ద ఎత్తున పేరుకుపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతూ ఉండడంతో హైవే పై వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనదారుల నుంచి నిత్యం వందల రూపాయలు టోల్ చార్జీల రూపంలో వసూలు చేసే టోల్ ప్లాజాలు శుభ్రత విషయంలో మాత్రం తమకేమీ పట్టనట్టుగా వ్యవహరించడం బాధాకరం. ఈ పరిస్థితిపై ఎన్ హెచ్ హైవే అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తూ ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. అసలు టోల్ ప్లాజా దగ్గర పలు రకాల షాపులకు, హోటళ్ళు, దాబాల వారికి అనుమతి వుందా ఉంటే ఎవరు వారికి అనుమతి ఇచ్చారు. మరి రోడ్డు పక్కన చెత్త పడేస్తే ఆ చెత్త తీసే బాధ్యత ఎవరు తీసుకుంటారు. ఈ పద్ధతిపై టోల్ చార్జ్ కట్టి ప్రయాణం చేసే వాహనదారులు ఎన్ హెచ్ 140 వారిని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఎన్‌హెచ్ వారుస్పందించిటోల్ గేట్ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచవలసినదిగా వాహనదారులు కోరుతు న్నారు.

## అప్పలాయగుంటలో వైకుంఠ ద్వారం ఏర్పాటు

వడమాలపేట, జనవరి 8 ప్రభాతవార్త:

వడమాలపేట మండలం అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం వైకుంఠ ద్వార దర్శనం ఏర్పాటు చేస్తున్నట్లు సూపరింటెండెంట్ శ్రీవాణి తెలిపారు. భక్తులకు ఎక్కువ సమయం ఉత్తర ద్వార దర్శనం కల్పించడం కోసం శుక్రవారం ఉదయం 12.05 గంటలకు నిత్య కైంకర్యాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. తిరుప్పావై ప్రవచనాలతో ప్రారంభమై కొలువు, అర్చన, స్వామి, అమ్మవార్లకు అభిషేకం అనంతరం ఉదయం 3.30 గంటల నుంచి సర్వదర్శనం ప్రారంభమవుతుందని తెలిపారు. 7.15 గంటల నుంచి 8 గంటల వరకు రెండవ గంట, నివేదన, సాయంత్రం శ్రీవారి వాహన ఆస్థానం నిర్వహిస్తున్నట్లు వరకు నిరంతరాయంగా సర్వదర్శనం కల్పిస్తున్నామని, రాత్రి 9 గంటలకు ఏకాంతసేవ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

## వైకుంఠ ఏకాదశి వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కెవీబీ పురం, జనవరి 8 ప్రభాతవార్త:



మండలంలోని వైకుంఠ ఏకాదశి పర్వదినం పండుగ సందర్భంగా కాట్రపల్లి గ్రామంలో వెలసిన శ్రీదేవి భూదేవి వైకుం ఠ నాథ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకా దశి వాల్‌పోస్టర్లను భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అధికార పార్టీనా యకుడు, శ్రీకాళహస్తి దేవస్థానం మాజీ ట్రస్టు బోర్డు చైర్మన్ కోలా ఆనంద్ ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ నెల 10 తేదీ వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం ఆలయంలో ఏర్పాటు చేశామని ఏకాదశి సందర్భంగా ఉత్తర వైకుంట ద్వారం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గవర్ల కృష్ణయ్య, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సీ.ఎం.ఏ ఫౌండేషన్ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విద్యార్థుల

తిరుపతి విద్య జనవరి 8 ప్రభాత వార్త:

ఇన్స్టిట్యూట్స్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ కొలకత్తా వారు విడుదల చేసిన ఫలితాల్లో స్థానిక ఎల్ ఐ సి రోడ్డు లో ఉన్న ఎమరాల్డ్స్ కళాశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించినట్లు ఎమరాల్డ్స్ డైరక్టర్లు ఇ. గిరిధర్, కె. విశ్వనాథ్ లు తెలియచేశారు. ఈ ఫలితాల్లో ఫౌండేషన్ కోర్సు నందు శ్రీకర్. వి. 298, నందిని ఎస్.ఐ. 284, అబ్దుల్ లతీఫ్. ఎస్. 282, పూర్ణిమ. ఆర్. 282, హరీష్. ఎ. 280, విగ్నయ ఆర్. 272, దీపిక. బి. 268 మార్కుల సాధించి టాపర్లుగా నిలవడంతో పాటు మొత్తంగా 95.13 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వారు తెలియచేశారు. ఈ ఫలితాలు సాధించిన విద్యార్థులు, అధ్యాపక బృందాన్ని వారు ఈ సందర్భంగా అభినందించారు.

## సంస్కృత వర్శిటీకి రాజభాష నాయక బిరుదు ప్రదానం

తిరుపతి విద్య జనవరి 8 ప్రభాతవార్త:



జాతీయ సంస్కృత వర్శిటీ ద్వారా రాజభాష ప్రచార ప్రసారానికి వర్శిటీ చేస్తున్న కృషికి గాను భారతీయ భాష సంస్క ృతి సమితి, దిల్లీ ద్వారా జాతీయ సంస్క ృత వర్శిటీ కి రాజభాష నాయక అనే బిరుదుని ప్రధానం చెయ్యడం జరిగినది. ఆ పురస్కారాన్ని బుదవారం వర్శిటీ కులపతులు ప్రొ.జి.యస్.ఆర్ కృష్ణమూర్తికి రాజభాషా సమితి సభ్యులు అందించడం జరిగినది. అనంతరం వి.సి మాట్లాడుతూ రాజభాషా సమితి ద్వారా చేస్తున్న కృషిని ప్రశంసించారు. విశ్వవిద్యాలయంలో అన్ని భాషల వికాసం కొరకు కృషిచేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.ఆర్.జె.రమాశ్రీ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డా.కె.సాంబశివమూర్తి, అకడమిక్ డీన్ ప్రొ.రజనీకాంత శుక్లా, డి.డి.ఇ డైరెక్టర్ ప్రొ.సి.రంగరాజన్, డిప్యూటి లైబ్రేరియన్ డా.ఎన్.వసంత్, రాజభాషా సమితి సభ్యులు డా.లతా మంగేష్, డా.చారుకేష్ పాల్గొన్నారు.

## శ్రీవారి భక్తుడు శక్తిదాసన్ సైకిల్ యాత్ర

41 సంవత్సరాలుగా ఏడాదికి ఒకమారు

చంద్రగిరి, జనవరి 8 ప్రభాతవార్త:



తిరుమల శ్రీవారి భక్తుడు శక్తిదాసన్ (62) తన సైకిల్ యాత్ర మారోమారు పూర్తి చేసుకుని బుధవారం తిరుగుప్రయాణమయ్యారు. తమిళనాడు, కోయంబత్తూరు జిల్లా, కినత్తుకడవు, సింగరామ్ పాళ్యంకు చెందిన శక్తిదాసన్ (61) తిరుమల శ్రీవారి దర్శనార్థం సైకిల్‌పై వచ్చారు. ముందుగా తిరుచానూరులోని శ్రీపద్మావతీ అమ్మవారిని దర్శించుకుని రాత్రి అక్కడే బస చేశారు. వేకువజామున తిరుమలకు కాలినడకన బయలుదేరి వెళ్ళి స్వామి వారిని దర్శించుకుని తిరిగి రాత్రికి తిరుచానూరు చేరుకున్నారు. మరోమారు అమ్మవారిని దర్శించుకున్న ఆయన తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో చంద్రగిరి బైపాస్ రోడ్డులోని నాగాలమ్మ ఆలయం వద్ద అమ్మవారిని దరి ్శంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 41వ సంవత్సరం సైకిల్‌పై 400 కిలోమీటర్లుకు పైగా ప్రయాణించి స్వామి వారిని దర్శించుకుని తిరిగి వెళుతున్నట్లు తెలిపారు. స్వామీజీ సుదూర ప్రయాణం పైగా సైకిల్ తొక్కుకుంటూ రావడం కష్టం కదా అని ప్రశ్నిస్తే తిరుమల శ్రీవారి పట్ల తనకున్న భక్తి ఆ కష్టాన్ని దూరం చేస్తున్నట్లు తెలిపారు. గతంలో 1986 అక్టోబర్ 16 నుండి 56 రోజుల పాటు కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు అక్కడి నుండి తిరిగి తమిళనాడులోని శాలం వరకు సైకిల్‌పై ఆధ్మాత్మిక యాత్ర విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు.

## చెరువులో ఈతకు వెళ్ళిన వ్యక్తి మృతి

చంద్రగిరి, జనవరి 8 ప్రభాతవార్త:



మండల పరిధిలోని పనపాకం పంచాయతీ పరిధిలోని పన పాకం హరిజనవాడకు చెంది న ముగ్గురు ఈతకు వెళ్ళగా ఒకరు మృతి చెందిన దుర్ఘటన బుధవారం కోమటివానిచెరువులో చోటుచేసుకున్నది. పనపాకంకు చెందిన కత్తి యోగేష్, రాజేష్ ఈతకు వెళ్ళారు. వీరితో పాటు వెళ్ళిన వనజమ్మ కుమారుడు కత్తి విజయ్‌కుమార్ (28) ఈతరానప్పటికి చెరువులోకి దిగడంతో నీటిలో మునిగిపోయి ఊపిరాడక మృతి చెందాడు. దీంతో సమాచారం అందుకున్న పోలీసు, రెవెన్యూ యంత్రాంగం కోమటి వాని చెరువు వద్దకు చెరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీమెడికల్ కళాశాలకు తరలించారు.

## రెవెన్యూ సదస్సులో 630 ఫిర్యాదులు



బాలాయపల్లి, జనవరి 8 ప్రభాతవార్త : రెవెన్యూ సదస్సులో 630 ఫిర్యాదులు పలు సమస్యలపై అందినట్లు డిప్యూటీ తాసిల్దార్ శిరీష తెలిపారు. మండలంలోని చుట్టి గ్రామంలో వివిరి రోజు జరిగిన రెవెన్యూ సదస్సును ఆమె నిర్వహించారు. సమస్యలపై వచ్చిన వినతిపత్రాలను ఆన్లైన్ చేసినట్లు తెలిపారు. పలు భూసమస్యలపై వినతి పత్రాలను డిప్యూటీ తాసిల్దార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్వే తారక రామారావు, ఆర్ ఐ శ్రీకాంత్, వీఆర్వో జయశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

## ముందస్తు సంక్రాంతి సంబరాలు



కోట, జనవరి 8 ప్రభాతవార్త : కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు రంగవల్లులు ప్రతీకలని చెప్పారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సంక్రాంతి పండుగను ప్రతిబింబించేలా ముగ్గులు వేశారు. భోగి, మకర సంక్రాంతి, కనుమ విశేషాలతో కూడిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. సంప్రదాయాలు కనుమరుగు కాకుండా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమాలు ఉమన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ వల్లీదేవి ఆధ్వర్యంలో జరిగాయి. మేనేజర్ కోటంరెడ్డి రామ కృష్ణారెడ్డి, ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి ప్రొఫెసర్ ఎస్.ఇందుమతి, డాక్టర్ వాసవి, డాక్టర్ పి.శారద, రాఘవమ్మ, కోఆర్డినేటర్ రాజేష్, జి.శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## హామీల అమలులో కూటమి ప్రభుత్వం వైఫల్యం : సిపిఐ



చిల్లకూరు, జనవరి 8 ప్రభాతవార్త : ఎన్నికల ముందు నిరుపేదలకు ఇచ్చిన హామీ ప్రకారం పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు నివేశన స్థలాలు మంజూరు చేసి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయల రుణం ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి. మురళి డిమాండ్ చేశారు. బుధవారం చిల్లకూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సంయుక్తంగా ఇళ్ల స్థలాల సామూహిక అర్జీ సమర్పణ ధర్నాను నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ నేడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తక్షణమే ఎన్నికల హామీలను నెరవేర్చాలని కోరారు. రైతాంగానికి సాగు భూములు ఇస్తామన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ముఖ్యమంత్రి గత ప్రభుత్వ మాదిరిగా పాలన చేస్తున్నారే తప్ప ఇచ్చిన హామీలను సూపర్ సిక్స్‌లను నెరవేర్చడంలో పూర్తిగా వైఫల్యం చెందారని తీవ్రంగా విమర్శించారు. ఉపాధి హామీ కూలీలకు కూడా పని కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ ధర్నా అనంతరం చిల్లకూరు రెవెన్యూ తహసీల్దార్ శ్రీనివాసులకు ఇళ్ల స్థలాల లబ్దిదారులు సామూహికంగా అర్జీలను సమర్పించారు. అలాగే రెట్టపల్లి భూసమస్య, నాంచారంపేట దళితుల శ్మశాన వాటిక స్థలం సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సిహెచ్. ప్రభాకర్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్, గూడూరు పట్టణ కార్యదర్శి షేక్ కాలేషా, చిల్లకూరు మండల సీపీఐ కార్యదర్శి గుండాల రమేష్, డీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎంబేటి చంద్రయ్య, ఇన్సాఫ్ సమితి రాష్ట్ర ఉప కార్యదర్శి షేక్ జమాలుల్లా, బీకేఎంయూ నియోజకవర్గ కార్యదర్శి ఎన్. శ్రీనివాసమూర్తి, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా వెంకటేశ్వర్లు (సీవీఎల్), చెన్నూరు రఘురామయ్య, కన్నా తులసి, సుబ్బమ్మ, కలిసేటి వెంకటయ్య, వడ్డేపల్లి అంకయ్య, ఈతముక్కల పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు దుప్పట్లు పంపిణీ



కోట, జనవరి 8 ప్రభాతవార్త : వెంకటగిరి వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి జన్మ దిన వేడుకలను కోట మండలం గూడలి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. వైసీపీ నాయకులు వేమారెడ్డి షనీల్‌రెడ్డి ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి అడుగుజాడల్లో రామ్‌కుమార్‌రెడ్డి రాజకీయ ప్రయాణం కొనసాగిస్తున్నారని చెప్పారు. మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆ సంగమేశ్వరస్వామి ఆలయంలో, ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగూర్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, వేణురెడ్డి, విజయసారథిరెడ్డి, పల్లవోలు రాజులు, నాగార్జున, బుల్లెయ్యలు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ చే విద్యా సామాగ్రి పంపిణీ



గూడూరు, జనవరి 8 ప్రభాతవార్త : రోటరీ క్లబ్ గూడూరు వెస్ట్ ఆధ్వర్యంలో బుధవారం సీనియర్ రోటేరియన్ శ్రీకంటి రామ్మోహన్ రావు రాజ్యలక్ష్మి దంపతుల మనవడు ఆర్యన్ జన్మదిన సందర్భంగా గూడూరు రెండవ పట్టణం లోని ఇందిరా నగర్ మునిసిపల్ పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామగ్రి, స్వీట్స్, బిస్కెట్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రామమోహన్‌రావు దంపతులు మాట్లాడుతూ పేద వర్గాల వారు ఎక్కువగా నివాసం వుండే ఈ ప్రాంతంలో ప్రభుత్వ స్కూల్ ఆవశ్యకతను గుర్తించి స్కూల్ భవనం నిర్మించి అందరి సహకారంతో ప్రభుత్వం ద్వారా స్కూల్ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు నాశిన నాగులు, మాజీ కౌన్సిలర్లు బిల్లు చెంచురామయ్య, పరుచూరు సుబ్రమణ్యం, రోటరీ సభ్యులు సూర్య ఫాన్సీ సుబ్రమణ్యం, బుజగేంద్ర రావు, సనత్ కుమార్ రెడ్డి, రాఘవ రెడ్డి, నాగరాజారెడ్డి, హరనాథ్ రెడ్డి, మందిపాటి వాసు, బలరామి రెడ్డి మరియు పాఠశాల ఉపాధ్యాయునిలు పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతులు అందచేత




గూడూరు, జనవరి 8 ప్రభాతవార్త: స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విక్రమ సింహపురి యూనివర్సిటీ ఇంటర్ కాలేజీయట్ గూడూరు జోన్ మెన్ క్రికెట్ టోర్నమెంట్ 7వ తేదీ ప్రారంభమై, 8వ తేదీన ముగిసింది. ఎస్‌కెఆర్ డిగ్రీకళాశాల డిపార్ట్మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అయిన డాక్టర్ పి.నారాయణ రాజు ఆధ్వర్యంలో విజయవంతంగా జరిగిన టోర్నమెంట్ విజేతల వివరాలు ప్రకటించడం జరిగింది. ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గూడూరు తొమ్మిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి విజేతగా నిలవగా, ఎస్‌విఎస్. ఎస్.సి.గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ సూళ్లూరుపేట రన్నర్‌గా నిలిచింది. మొదటగా బ్యాటింగ్ ఎంచుకున్న ఎస్వీఆర్ట్స్ కాలేజీపై ఎస్‌కేఆర్ డిగ్రీ కాలేజ్ విద్యార్థులు గెలుపొంది ఫైనల్‌కి చేరుకున్నారు. తర్వాత బ్యాటింగ్ ఎంచుకున్న సూళ్లూరుపేట డిగ్రీ కళాశాల, వైష్ణవి వెంకటగిరి కళాశాల పై గెలుపొంది ఫైనల్ కి చేరుకుంది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన యూరప్‌లోని టి.సి.ఎస్ హెడ్ అయిన సప్తగిరి చేపలపల్లి విజేతలను అభినందించారు. అదేవిధం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.శివప్రసాద్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పి. నారాయణ రాజు, సూళ్లూరుపేట డిగ్రీ కళాశాల పి.డి.అమ్మాజీ, యూనివర్సిటీ అబ్జర్వర్ ఎం.రవీంద్రబాబు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది అందరూ విజేతలను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శివప్రసాద్ మాట్లాడుతూ ఎస్.కే.ఆర్.డిగ్రీ కళాశాల విద్యార్థులు చదువులోనే కాకుండా ఆటల పోటీల్లో కూడా విజేతలుగా నిలవడం చాలా సంతోషంగా ఉందని ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి. నారాయణ రాజుని అభినందించారు.

## ముగిసిన వాద్వాని పౌండేషన్ బోధన శిక్షణ



గూడూరు, జనవరి 8 ప్రభాతవార్త : ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో గత మూడు రోజుల నుండి జరుగుతున్న వాద్వాని పౌండేషన్ వారి బోధనా శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శిక్షకులుగా విచ్చేసిన స్వాతి పుత్రన్, మాస్టర్ ట్రైనర్, వాద్వాని పౌండేషన్, అభ్యర్ధులకు వాద్వాని ఫౌండేషన్ వారి లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టం ఫర్ స్టూడెంట్స్ మీద చాలా చక్కగా వివిధ రకాల బృంద కార్యక్రమాలతో శిక్షణ ఇవ్వడం జరిగింది. అంతే కాకుండా ఇందులో భాగంగా స్వాతి పుత్రన్ చివరి సంవత్సర విద్యార్థిని విద్యార్థులతో మాట్లాడుతూ వారికి బృందశిక్షణ, ఇంటర్వ్యూని ఎదుర్కొనడానికి అవసరమైన శిక్షణను వాద్వాని పౌండేషన్ వారి ద్వారా ఎలా పొందవచ్చో తెలిపి వారికి అవసరమైన లాగిన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కె.ధనుంజయ మాట్లాడుతూ ఆధునిక బోధనా పద్ధతులు ఆదిశంకర విద్యార్థులకు పరిచయం చేయడమే లక్ష్యంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిం చుకున్నారు. ఎన్.అకడమిక్స్ ఎం.రాజయ్య మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమాన్ని అన్ని విభాగాల ప్రొఫెసర్స్ పాస్ట్ మైనర్‌లో పూర్తి చేస్తామన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ప్రముఖ పాత్ర పోషించిన రామ మోహన్‌ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఇన్చార్జిటి. వేణుమాధవ్,ఎం.రాజయ్య, ఎ.ఇమ్మానుయేలు, వినయ్ కెసి,రామయ్య, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## యువత సమాజ శ్రేయస్సుకు దిక్సూచి కావాలి



తిరుపతి విద్య,జనవరి 8 ప్రభాతవార్త: విలువలతో కూడిన విజ్ఞానంతో పాటు క్రమశిక్షణతో సన్మార్గంలో పయనిస్తూ ఉన్నత లక్ష్యాలు సాధనతో యువత సమాజ శ్రేయస్సుకు దిక్సూచికలుగా నిలవాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ యువతకు పిలుపు నిచ్చారు. డాలర్స్ గ్రూప్ ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో మెగా ఇంపాక్ట్ అధ్వర్యంలో గత రెండు రోజుల పాటు మహతి కళాక్షేత్రంలో చేపట్టిన ఉచిత వ్యక్తిత్వ వికాస సదస్సు బుధవారంతో ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సాధించాలనే సంకల్పం ఉంటే అనుకున్న లక్ష్యాలను చేరుకోవడం సులభతర మన్నారు. విద్యా విజ్ఞానంతో పాటు సామర్థం, నైపుణ్యాలను పెంపొందించు కున్నప్పుడే యువత ఉజ్వల భవిత సుసాధ్యమన్నారు. విద్యావంతులైన యువతలో నైపుణ్యాలను మెరుగు పరిచి వారి ఉన్నతికి తోడ్పడాలనే లక్ష్యంగా డాలర్స్ గ్రూప్ అధినేత డాలర్ దివాకర్రెడ్డి మేధస్సు కలిగిన ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుల ద్వారా శిక్షణ కల్పించడం స్ఫూర్తిదాయకమన్నారు. మరో అతిథి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు మాట్లాడుతూ జీవితాలను విచ్ఛన్నం చేసే డ్రగ్స్, మత్తు పదార్థాల పట్ల యువత జాగృత వహించి, మానవీయతా దృక్పథంతో తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. సీబీఐ మాజీ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దేశ భవిష్యత్లో యువత ఎంతో కీలకమని తెలిపారు. అయితే నేటి ఆధునిక సమాజంలో సోషియల్ మీడియా, డ్రగ్స్, రీల్స్ వంటి యువతను మానసికంగా దెబ్బతీస్తోందన్నారు. వీటి పట్ల యువత జాగృతతో ఉంటూ జీవిత లక్ష్య సాధనలో ముందడుగు వేయాలన్నారు.రెండు రోజుల పాటు సాగిన వ్యక్తిత్వ వికాస సదస్సుకు ఉమ్మడి చిత్తూరు జిల్లానుంచి అధిక సంఖ్యలో యువతీ యువకులు పాల్గొన్నారు.

## ఘనంగా నేదురుమల్లి జన్మదిన వేడుకలు




కోట, జనవరి 8 ప్రభాతవార్త : దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి తనయుడు, ఎన్‌బికెఆర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో ఘనంగా నిర్వహించారు. ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉద్యోగ సంఘ నాయకులు భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అసోసియేషన్ నాయకులు డాక్టర్ జి.హరినాథరెడ్డి మాట్లాడుతూ కళాశాలనుకరస్పాండెంట్ రామ్‌కుమార్‌రెడ్డి ప్రగతిపథంలో నడిపిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చింతా రవీంద్రారెడ్డి, వివిధ విభాగాధిపతులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రిని కలిసిన కామిరెడి



నాయుడుపేట జనవరి 8 ప్రభాతవార్త: వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీముఖ్య మంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి నెల్లూరుజిల్లా వైసిపి ముఖ్య నాయకులు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి సూళ్ళూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా వైసిపి ఆర్గనైజింగ్ సెక్రటరి కామిరెడ్డి రాజారెడ్డి వైయస్ జగన్ మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిచారు. పుష్పగుచ్ఛం అందజేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట సహకార బ్యాంక్ మాజీ చేర్మేన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, మున్సిపాల్టి వైస్‌చేర్మేన్ జలధంకి వెంకటక్రిష్ణరెడ్డి, కౌన్సిలర్లు దారా రవి,పాపారెడ్డి చంద్రాండ్డి తదితర నాయకులు,కార్యకర్తలు ఉన్నారు.

## మధ్యాహ్నం ముఖ్యమంత్రికి అర్జీ...రాత్రికల్లా రైతుకు పంపుసెట్

### - సిఎం చంద్రబాబు ఎదుట ఆనందభరితుడైన రైతు !!



కుప్పం, జనవరి 8 ప్రభాతవార్త : ప్రజలు, రైతుల సమస్యల పరిష్కారంలో సిఎం చంద్రబాబు నాయుడు చూపే చొరవ అద్భుతం. మంగళవారం మధ్యాహ్నం కుప్పం తెదేపా కార్యాలయంలో సిఎం చంద్రబాబునాయుడు జననాయకుడు పోర్టల్ ఆవిష్కరించి పలువురు రైతులు, ప్రజల సమస్యలు నేరుగా అడిగి తెలుసుకున్నారు. శాంతిపురం మండలం సోమాపురంకు చెందిన రైతు చలపతి తన సమస్యను సిఎంకు నేరుగా వివరించాడు. తాను 80వేల రూపాయలు అప్పు చేసి తన పొలంలో బోరు వేయించానని డబ్బులు లేక పంప్‌సెట్ బిగించలేక పోయినట్లు పేర్కొన్నాడు. దీంతో పంటలసాగు చేపట్టడం కష్టంగా మారిందని తనను ఆదుకోవాలని సిఎంను కోరాడు. రైతు సమస్యను పరిష్కరిం చాలని సిఎం చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను అక్కడే ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు మంగళవారం రాత్రి ఏడు గంటలకల్లా రైతు చలపతి పొలంలో బోరుకు 10హెచ్‌పి/30 పంప్‌సెట్ బిగించి నీరు అందించారు. దీంతో బుధవారం రైతు చలపతి కుప్పం ఆర్‌అండ్‌బి అతిథిగృహం చేరుకుని సిఎం చంద్రబాబును చూసి నా దేవుడు చంద్రబాబు, జై చంద్రన్న, జైజై చంద్రన్న అంటూ ఆనంద భరితుడై సిఎంకు కృతజ్ఞతలు చెప్పి సంతోషంగా జరిగిన విషయాన్ని సిఎంకు వివరించాడు.

## ప్రయాగ్‌రాజ్‌లో 18,26, ఫిబ్రవరి 3,12తేదీల్లో... స్వామి కల్యాణోత్సవాలు



తిరుమల,జనవరి 8 ప్రభాతవార్తప్రతినిధి: ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్‌రాజ్‌లో ప్రారంభంకానున్న మహా కుంభమేళాలో టిటిడి శ్రీవారి నమూనా ఆలయం నిర్మిం చిందని, అక్కడ 170మంది సిబ్బందితో ప్రతి రోజూ కైంకర్యాలు జరిపిస్తామని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు వెల్లడించారు. జనవరి 18,26, ఫిబ్రవరి 3,12 తేదీల్లో నాలుగుసార్లు స్వామివారి కల్యాణోత్సవాలు నిర్వహిస్తామన్నారు.



**టిటిడీ అన్నప్రసాదం ట్రస్టు 50వేల అమెరికన్ డాలర్లు విరాళంను చైర్మన్ బిఆర్ నాయుడుకు విరాళం అందజేసి దాత చికాగో(యూఎస్ఏ)కు చెందిన ఎన్.ఆర్.ఐ పెరంబుదూరు కందల శ్రీనివాసాచార్య.** ప్రభాతవార్త, తిరుమల

## పోలీసులకు మొహమాటం!

### -హెల్మెట్ లేకుండా బండి నడుపుతున్నా ఉదాసీనత ఎందుకో!?

ప్రభాతవార్త-తిరుపతి :



"వడ్డించేవాడు మనవాడైతే బంతిలో ఎక్కడ కూర్చున్నా ఒక్కటే"అనే చందంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి బండి నడపాలనిరాష్ట్ర ఉన్నతన్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలిచ్చినా అమలు చేయాల్సిన పోలీసుశాఖ మొహమాటానికి పోతుందన్నట్లు తయారైంది. తిరుపతి నగరంలో హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారిలో సామాన్యజనమేగాక పోలీసు,రవాణాశాఖ, విద్యావేత్తలు, యువత ఉన్నారంటే హెల్మెట్ ధరించడం ఎంత బాగా అమలుకావడంలేదో తెలుస్తుంది. ఇందుకు మంగళవారం మధ్యాహ్నం నగరంలోని ప్రధాన కూడళ్ళు రామానుజసర్కిల్, ఎన్టీఆర్‌కూడలి, టిఎంఆర్ కూడలి, లీలామహల్ కూడలి,అన్నమయ్యకూడలి ఇలా పలు ప్రాంతాల్లో "వార్త"పరిశీలనలో హెల్మెట్ లేకుండానే బండి నడుపుతున్న వాళ్ళు పెద్దసంఖ్యలోనే ఉండటం విశేషం.

ఇటీవల తిరుపతి జిల్లా పోలీసులు హెల్మెట్ ధారణపై తిరుపతినగరంలోనేగాక జిల్లావ్యాప్తంగా అవగాహన ర్యాలీలు పెద్దఎత్తున నిర్వహించారు. ప్రతి ఒక్కపోలీసు హెల్మెట్‌ధరించి బండి నడపాలని చైతన్యం కల్పించేలా చేశారు. అయినా గత వారంరోజులుగా తిరుపతి నగరంలోనే వందలసంఖ్యలో ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ లేకుండానే వాహనాలు నడుపుతుండటం పరిపాటిగా మారింది. పలు కూడళ్ళలో ట్రాఫిక్ విధులు నిర్వహించే ట్రాఫిక్ ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్ళు చూసీచూడనట్లు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. బండి నడిపితే తలకు హెల్మెట్‌ఉండాల్సిందేనని హైకోర్టు ఆదేశాలు మన పోలీసులు అమలుచేయలేకపోవడం మొహమాటంగా ఉందేమోనని జనం విమర్శలు సంధిస్తున్నారు.

ద్విచక్రవాహనదారుడు సురక్షితంగా వాహనాలు నడిపి, ప్రాణాలను కాపాడుకోవడంలో శిరస్త్రాణం (హెల్మెట్) ధరించడం తప్పనిసరి ఆదేశాలిచ్చినా ఆచరణలో పెట్టేదెవరనే ప్రశ్నలు ఇప్పుడు వ్యక్తమవుతున్నాయి. హెల్మెట్ ధరించి బండి నడపాలని పోలీసులు అవగాహన కల్పిస్తున్నా ఆచరణలో పెట్టేవారే లేకపోతున్నారు.హెల్మెట్ లేకుండా బండి నడిపినా, సెల్‌ఫోన్ మాట్లాడుతూ బండి నడిపినా జరిమానా విధించాల్సిన పోలీసులు పట్టీపట్టనట్లు ఉండటం దేనికి సంకేతమనేది వారికే తెలియాలి. నగరంలో నాలుగులక్షల పైవరకు ద్విచక్రవాహనాలు ఉన్నాయి. ఇందులో కనీసం సగంశాతంమందికి కూడా హెల్మెట్లు లేవంటే ఆశ్చర్యపోవలసిన విషయం లేదు. హెల్మెట్ ధరించాలనే విషయంపై చాలావరకు విధుల్లో ఉన్న పోలీసులు,ట్రాఫిక్ పోలీసులు కూడా హెల్మెట్ ధరించకపోవడం మరో కొసమెరుపు. ఇక తిరుపతి పోలీసులు ఈ విషయంపై ఎంతవరకు చట్టప్రకారం ముందుకు కదులుతారో చూడాల్సిందే.

## అభివృద్ధి పనులకు అంచనాలు సిద్ధం చేయాలి: కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, జనవరి 8 ప్రభాతవార్త: అభివృద్ధి పనులకు అంచనాలు సిద్ధం చేయాలని కమిషనర్ ఎన్. మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ పరిధిలోని మూడవ వార్డు పోస్టల్ కాలనిలో ప్రజల ఫిర్యాదులను కమిషనర్ ఎన్.మౌర్య క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చే సమస్యలను కమిషనర్ అధికారులతో కలసి పరిశీలిస్తున్నారు. ఈ మేరకు పోస్టల్ కాలనిలో రోడ్లు, డ్రెయినేజీ కాలువలను పరిశీలించారు. పారిశుద్ధ్య పనులు మెరుగ్గా చేపట్టాలని అన్నారు. అలాగే అభివృద్ధి పనులకు అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే డ్రెయినేజీ కాలువల్లో ఎప్పటికప్పుడు మురుగు, చెత్త తొలగించి మురుగునీరు సజావుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు, కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.రమణ, ఏసిపి బాలాజి, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్ వైజర్ సుమతి, తదితరులు ఉన్నారు.

## త్వరలో చెత్త తరలింపు -టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు



తిరుమల,జనవరి 8ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలకొండపై గత దశాబ్ధకాలంగా ప్రోగైన వ్యర్థాల నిల్వచేసే డంపింగ్ యార్డును బుధవారం ఉదయం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు తనిఖీ చేశారు. భారతప్రభుత్వ మాజీ సైంటిఫిక్ సలహాదారుడు జి.సతీశ్‌రెడ్డితో కలసి ఛైర్మన్ కాకులకొండ వద్ద డంపింగ్‌యార్డును పరిశీలించారు. తరలించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

## నిధుల వినియోగంపై ఆడిట్ నిర్వహణ: ఎంపీడీవో



బాలాయపల్లి, జనవరి 8 ప్రభాతవార్త : మండలంలో 2023-24వ సంవత్స రంలో జరిగిన నిధుల ఖర్చుపై పక్కగా ఆడిట్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో డీజే వినీల్ కుమార్ తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు,జనరల్ ఫండ్ ఖర్చులపై రికార్డులను పరిశీలించారు. నిధుల వినియోగంపై రికార్డులన్నీ పక్కగా ఉన్నట్లు ఎంపీడీవో తెలిపారు.

## పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎంఈఓ

బాలాయపల్లి, జనవరి 7 ప్రభాతవార్త : మండలంలోని యాచవారం ఎస్సీ కాలనీలోనే ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ ఖిల్లా వెంకటేశ్వర్లు ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల చేత పాఠ్యపుస్తకాలు చదివించి వారి సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. ప్రైవేటు పాఠశాల కన్నా ప్రభుత్వ పాఠశాలలు మిన్నగా ఉన్నట్లు తెలిపారు. ఈనెల 10వ తేదీ నుండి పాఠశాలలకు సంక్రాంతి సెలవులను ప్రభుత్వం ప్రకటించినట్లు చెప్పారు.

## బాల్యవివాహాలను నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు



వెంకటగిరి, జనవరి 8 ప్రభాతవార్త : బాల్య వ్యవహారాలు జరిపించే వారిపై చర్చ చర్యలు ఉంటాయని మున్సిపల్ ఛైర్‌పర్సన్ నక్క భానుప్రియ తెలిపారు. బాల్య వివాహాలు చాలా వరకు తగ్గాయని ఇంకా అక్కడక్కడా జరుగుతున్నాయని అవి కూడా లేకుండా పోవాలని తెలిపారు. కిషోరీబాలికలకు తల్లిదండ్రు లు పౌష్టికర మైన ఆహారం అందించాలని తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని ఉషోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కిషోరీ వికాసంపై సిడిపిఓ సమావేశం నిర్వహించారు. కిషోర బాలికలకు సమాజంలో ఎదుర్కొనే పలు సమస్యలను అంగన్వాడి సిబ్బంది తెలియజేయాలని తెలిపారు. సమావేశంలో టిడిపి ఓ శంషాద్ బేగం, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ విజయశ్రీ, ఎస్సై లక్ష్మి భవాని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తూపిలిలో రెవెన్యూ సదస్సు



వాకాడు, జనవరి 8 ప్రభాతవార్త : వాకాడు మండలం తూపిలి గ్రామ పంచాయతీ సర్పంచ్ మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు కార్యక్రమం జరిగింది. బుధవారం రెవెన్యూ సదస్సులో మాట్లాడుతూ డిప్యూటీ తాసిల్దార్ సందీప్ కుమార్ మాట్లాడుతూ పంచాయతీలో ఉన్నటు వంటి గ్రామాలలో భూ సమస్యలు పరిష్కార కోసమే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సు కార్యక్రమం ప్రవేశపెట్టిందని ఈ కార్యక్రమంలో రైతులు ప్రజలు భూ సమస్యల మీద పరిష్కారం చేసుకోవాలని డిప్యూటీ తహశీల్దార్ సందీప్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ శకుంతల రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, శాఖల అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జగన్‌ను కలిసిన శ్రీమంత్‌రెడ్డి



సూళ్లూరుపేట, జనవరి 8 ప్రభాతవార్త: సూళ్లూరుపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి బుధవారం తాడేపల్లిలోని వైసీపీ ప్రధాన కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిశారు. సూళ్లూరుపేట నియోజకవర్గ ఎంపిపిలు, జడ్పిటిసిలు, మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, ఇతర ముఖ్య నేతలతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సూళ్లూరుపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. ఆయనతో పాటు వైసీపీ నేతలు కొళవి రఘు, గండవరం సురేష్‌రెడ్డి, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పుట్టగొడుగుల్లా పుటుకొస్తున్న బెల్టు షాపులు

నాయుడుపేట, జనవరి 8 ప్రభాతవార్త : మండలంలోని మేనకూరు, భీమవరం, బిరధవాడ, చిలమత్తూరు, కూచివాడ, ద్వారకాపురం, పూడేరు, గొట్టిప్రోలూరు తదితర గ్రామాల్లో పుట్టగొడుగుల్లా బెల్టుషాపులు పుట్టుకొస్తున్న సంబంధిత ఎక్సైజ్-పోలీసులు మాత్రం పట్టించుకోవడంలేదని గ్రామీణ మహిళలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. బెల్టుషాపులను గ్రామాల్లో నిర్మూలించాలని మహిళలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరసనలు తెలిపినా, అధికారులు పట్టించుకొన్న దాఖలాలు మాత్రం కనిపించలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో బెల్టు షాపులను నిర్మూలించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామీణ మహళలు అధికారులను కోరుతున్నారు.

### డాక్యుమెంట్స్ పోయివి

వాకాడు మండలం, మొలగనూరు గ్రామానికి చెందిన కర్లపూడి శ్రీనివాసులు తండ్రి తిరుపాలయ్య పొలం డాక్యుమెంట్స్ 02-01-2025న నాయుడుపేట నుంచి బస్సులో కోటకు వస్తుండగా పోయినవి. దొరికినవారు ఈ ఫోన్ నెం : 6303429779 తెలుపగలరు.